
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
బుధవారం 12 మార్చి 2025

ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 39.0
కనిష్ఠం : 20.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:20 (బుధ)
సహరి : 4:51 (గురు)



15న సీఎం చంద్రబాబు తణుకు పర్యటన

యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు

తణుకు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 15వ తేదీ శనివారం తణుకు పర్యటించనున్నారు. తొలుత పాలిటెక్నిక్ కళాశాల ఆడిటోరియంలో 300 టీడీపీ ముఖ్య ప్రతినిధులతో ముఖాముఖి సమావేశం అవుతారు. అనంతరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జడ్పీ స్కూలు ఆవరణలో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువుల ప్రదర్శన స్టాల్స్ సందర్శిస్తారు. ప్రజా వేదిక కార్యక్రమంలో వినతులు స్వీకరిస్తారు. స్టాల్, ప్రజా వేదిక కార్యక్రమ స్థలాలను ముఖ్యమంత్రి కార్యాలయ సెక్యూరిటీ విభాగం పరిశీలన అనంతరం ఖరారు చేస్తారు.

ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ నాగరాణి వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ రామ్‌కుమార్‌ను ఆదేశించారు. బారికేడింగ్ ప్రాంతాలు, హెలీప్యాడ్ ఏర్పాటు, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాపై సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. భోజన ఏర్పాట్లను డీఎస్‌వో, డీఎం పర్యవేక్షించాలన్నారు. ఎండ తీవ్రత నేపథ్యంలో సభా ప్రాంగణంలో తాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు.

హెలీప్యాడ్ స్థలాల పరిశీలన

సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో హెలీప్యాడ్ ఏర్పాటు ఏర్పాటుకు పాలిటెక్నిక్ కళాశాల ఆవరణను కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ పరిశీలించారు. జడ్పీ బాలికోన్నత పాఠశాలలో పార్కింగ్ కోసం పరిశీలించారు. జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, ఏఎస్పీ బి.భీమారావు, ఆర్డీవోలు కతీబ్ కౌసర్ బానో, దాసి రాజు, డీఎస్పీ విశ్వనాథ్, తహసీల్దార్ అశోక్‌వర్మ, పాలిటెక్నిక్ కాలేజి ప్రిన్సిపాల్ ఎన్.తులసీరాధ పాల్గొన్నారు.


తణుకు జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో కలెక్టర్, ఎస్పీ పరిశీలన


ఏలూరులో టిడ్కో గృహ సముదాయం

పక్కా ఇళ్లు.. పత్తా లేవు!

నెరవేరని సొంతింటి కల

- ఎనిమిదేళ్లుగా కొలిక్కిరాని నిర్మాణం
- ముందస్తు చెల్లింపులు ఏమయ్యాయి
- వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం
- కూటమి సర్కార్‌పై ఆశలు
- లబ్ధిదారుల జాబితాపై అనుమానాలు
- నిర్మాణం పూర్తికాకున్నా బ్యాంకర్ల నుంచి సంక్షిప్త సందేశాలు
- లబ్ధిదారుల్లో ఆగ్రహావేశాలు
- టిడ్కో నో రియాక్షన్

ఒకటి, రెండు రోజులు కాదు.. ఎనిమిదేళ్ల నుంచి సొంతింటి కల సాకారమవుతుందని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. టిడ్కో గృహ సముదాయంలో ఫ్లాట్ కోసం కేటగిరీల వారీగా ముందస్తు సొమ్ము రూ.50 వేల నుంచి రూ. లక్ష చెల్లించారు. ఏళ్లు గడిచినా నిర్మాణాలు పూర్తి కాలేదు. ఇళ్ల నిర్మాణంలో కొన్ని తొలి దశకు చేరుకోగా, మరికొన్ని నిలిచిపోయాయి. అంతకు ముందు టీడీపీ ప్రభుత్వం నిర్మాణాలను ఒక కొలిక్కి తీసుకువస్తే.. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. లబ్ధిదారుల పేరిట రుణాలు ప్రభుత్వం తీసుకుంది. ఇళ్లు లేవు కానీ అప్పు కట్టాలని బ్యాంకర్ల నుంచి సంక్షిప్త సందేశాలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వంపై ఆసలు పెట్టుకున్న లబ్ధిదారులు టిడ్కో ఇళ్లు ఎప్పటికి పూర్తి చేస్తారు.. ఎప్పుడు ఇస్తారు.. అని ఎదురుచూస్తున్నారు. ఏళ్ల క్రితం కట్టిన సొమ్ము ఏమైందని, తర్వాత ప్రభుత్వం తీసుకున్న రుణ భారం ఎలా మోయాలని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పట్టణ ప్రాంతాల్లో సాధారణ, మధ్యతరగతి కుటుంబాలు అద్దె ఇళ్లలో గడుపుతున్నాయి. వారికి సొంతిల్లు సమకూర్చేందుకు 2014-19 మధ్య అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం టిడ్కో గృహ సముదాయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పట్టణ ప్రాంతాలన్నింటిలో మూడు కేటగిరీల్లో లబ్ధిదారులను ఎంపిక చేశారు.

ఎ కేటగిరిలో 300 చదరపు అడుగుల ప్లాటుకు రూ.500, 400 చదరపు అడుగుల ప్లాటుకు రూ.50 వేలు, సీ కేటగిరిలో 430 చదరపు అడుగుల ప్లాటుకు రూ.లక్ష చొప్పున ముందస్తు సొమ్మును డీడీల రూపంలో వసూలు చేశారు. ఈ సొమ్మునంతా అప్పట్లో టిడ్కో ఖాతాలో ఐసీఐసీఐ బ్యాంకులో జమ చేశారు.

- ఏలూరు నగరంలోనే దాదాపు 6,480 టిడ్కో గృహాలు ప్రతిపాదించగా వీటిలో 2,208 ఫ్లాట్లు మాత్రమే పూర్తి చేయగలిగారు. వీటి నిమిత్తం ఎనిమిదేళ్ల క్రితమే రూ.19 కోట్లు లబ్ధిదారులు ముందస్తుగా చెల్లించారు.
- నూజివీడులో తొలుత 4 వేలకుపైగా టిడ్కో ఇళ్లు ప్రతిపాదించగా చివరికి 3,090 ఇళ్ల నిర్మాణం ఖరారు చేశారు. 2,790 ఫ్లాట్ల నిర్మాణం ఒక దశకు వచ్చింది. దాదాపు 3వేల మంది లబ్ధిదారులు రూ.16 కోట్లు చెల్లించారు.
- జంగారెడ్డిగూడెంలో 864 టిడ్కో గృహాలకు 804 వివిధ దశల్లో ఉన్నాయి. దాదాపు రూ.6 కోట్లకుపైబడే చెల్లించారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణానికి అడుగడుగునా ఆటంకాలే

టిడ్కో ఇళ్లలో గృహ ప్రవేశం ఎప్పుడు అనేదానిపై ఇంత వరకు స్పష్టత లేదు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రయత్నించింది. లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు ఇచ్చేలా జాగ్రత్తపడింది. తర్వాత వైసీపీ అధికారంలోకి రావడం, కరోనా విస్తరించడంతో టిడ్కో ఇళ్ల నిర్మాణం ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

జగన్ జమానాలో నిర్లక్ష్యం

పేద, మధ్యతరగతి వర్గాల సొంత ఇంటి కలను జగన్ ప్రభుత్వ ఐదేళ్లలో నాశనం చేసింది. పూర్తి కావచ్చిన నిర్మాణ పనులు పట్టించుకోలేదు. తర్వాత దెబ్బతింటున్న గోడలు, బాత్‌రూమ్‌లు, పైపులైన్‌ల సంగతి గాలికొదిలేశారు. లబ్ధిదారులంతా వేలకు వేలు ముందస్తు చెల్లింపులు చేశామని, కనీసం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రూపొందించిన లబ్ధిదారుల జాబితాలో తాము ఉన్నదీ లేనిదీ స్పష్టం చేయాలంటూ మునిసిపల్ కార్యాలయాల చుట్టూ తిరిగారు. అక్కడా సరైన సమాధానం లభించలేదు. టిడ్కో ఇళ్లను పర్యవేక్షిస్తున్న అధికారులు సైతం ప్రజలకు వివరణ ఇవ్వలేకపోయారు. ఏలూరు నగరం, మిగతా పట్టణాల్లో రూ.50 వేల నుంచి రూ. లక్ష చెల్లించిన లబ్ధిదారులంతా అప్పట్లో తమకు ఇచ్చిన అర్హత పత్రాలు భద్రంగా ఉంచుకున్నారు. 2022-23లో జగనన్న కాలనీల పేరిట అప్పటి జగన్ ప్రభుత్వం హడావుడి చేసింది. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను అప్పట్లో వలంటీర్లు స్థానిక వైసీపీ నాయకత్వాల ఆదేశాల మేరకు ఏమార్చారు. టిడ్కో ఇళ్లు ఎప్పుడు వస్తాయో తెలియదు, వాటిపై ఆశ వదులుకోండి, జగనన్న కాలనీల్లో ఇల్లు కోసం సంతకాలు చేయండంటూ వాడవాడలా తిరిగారు. కొందరేమో ఇప్పుడు ఇంటి స్థలం కూడా తీసుకోకపోతే టిడ్కో ఇళ్ల సంగతి దేవుడెరుగు ఇది కూడా పోతుందని వలంటీర్లు చెప్పినట్టే చేశారు. ఇప్పుడు టిడ్కో లబ్ధిదారులుగా చెప్పబడుతున్న వారిలో అనేక మందికి జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు, ఇళ్లు కూడా వచ్చాయి. కేవలం అప్పట్లో వలంటీర్ల హడావుడితో లబ్ధిదారులు భయపడి భంగపడ్డారు. ఇప్పటికీ టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో మార్పులు జరిగాయా అనేది సమాధానం లేని ప్రశ్నగా మిగిలింది. లబ్ధిదారులు చెల్లించిన ముందస్తు సొమ్ము సంగతి ఏమిటనేది అంతు బట్టడం లేదు. దీనికితోడు అధికార పార్టీ నేతలెవరూ వివరాలు వెల్లడించలేదు. విపక్షాలు మాత్రం పేదల పక్షాన నిలిచామంటూ హడావుడి చేస్తారు. అధికార పార్టీలు టిడ్కో ఇళ్లను పూర్తి చేసి పేదలకు స్వాధీనం చేసే విషయంలో మీనమేషాలు లెక్కిస్తూనే వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మొదటి ఆరు నెలల్లోనే టిడ్కో ఇళ్లలో గృహ ప్రవేశాలకు రంగం సిద్ధమైందంటూ ప్రచారం సాగినా ఇప్పుడు ఆ ఊసు ఎక్కడా వినిపించడంలేదు. వేల మంది లబ్ధిదారులు తమ పరిస్థితి ఏమిటో తేల్చాల్సిందేనని గట్టిగా పట్టుబడుతున్నారు.

ఇళ్లు ఇవ్వలేదు.. అప్పు కట్టమంటున్నారు..!

టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల పక్షాన బ్యాంకుల నుంచి రుణాలు పొందేలా వైసీపీ ప్రభుత్వం ప్రయత్నించింది. లబ్ధిదారుకు రూ.3.5 లక్షల నుంచి రూ.6 లక్షల రుణం మంజూరు, నెలవారీ కిస్తీ చెల్లించేలా బ్యాంకర్లు ప్రణాళిక రూపొందించారు. దీనితో లబ్ధిదారుల సెల్‌ఫోన్‌కు బ్యాంకుల నుంచి సంక్షిప్త సందేశాలు వస్తున్నాయి. మీ ఇంటి నిర్మాణ ఖాతాలో ఇంత చెల్లించాలి అనేదే సారాంశం. ఇంటి నిర్మాణమే పూర్తికాలేదు, బ్యాంకర్ల నుంచి ఇలాంటి సందేశాలు ఏమిటనేదే లబ్ధిదారుల ఆగ్రహం. బ్యాంకర్ల నుంచి కూడా పొంతనలేని సమాధానాలు వస్తున్నాయని లబ్ధిదారుల ఆవేదన. పట్టణ ప్రాంతాల్లో వెలుగు గ్రూపుల్లో సభ్యులుగా ఉన్న వారికే అత్యధికంగా టిడ్కో ఇళ్ల కేటాయించారు. ఇప్పుడు ఆ వెలుగు గ్రూపులు కూడా ఎక్కడికక్కడ లబ్ధిదారుల ఖాతాలను పునఃసమీక్షిస్తున్నాయి. అప్పట్లో మీరు కట్టింది ఎంత, ఇప్పటి వరకు ఈఎంఐ రూపంలో చెల్లించాల్సింది ఎంత అని ఆరా తీస్తున్నారు. నిర్మాణంలో బాధ్యత తీసుకోకుండా కేవలం ఇలాంటి పేను పెత్తనం చేయడం ఏమిటని లబ్ధిదారులు మండిపడుతున్నారు. వాస్తవానికి టిడ్కో అధికారులు ఇప్పటిదాకా లబ్ధిదారులకు స్పష్టమైన వివరణ ఇవ్వలేకపోయారు. నిర్మాణం విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలు, బ్యాంకుల్లో తీసుకున్న రుణాల చెల్లింపు పైన టిడ్కో ఇప్పటికీ సైలెంట్. దీనిపైనే కూటమి ప్రభుత్వం సమీక్షించాల్సిన అవసరం కనిపిస్తోంది.

అసంపూర్తి ఇళ్లకు అదనపు సాయం

కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసంపూర్తిగా ఉన్న పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందిస్తుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి మంగళవారం తెలిపారు. పీఎంఏవైలో ఇళ్లు మంజూరై, వివిధ దశల్లో ఉన్న యూనిట్ విలువకు అదనంగా బీసీ, ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు 75వేలు, పీవీటీజీలకు రూ.లక్ష అందించాలని నిర్ణయించిందన్నారు. నిర్మాణాలు ఏప్రిల్‌కు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో దాదాపు 49,436 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీల ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఆదివాసీలు 541 మంది ఉన్నట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీ జి.సత్యనారాయణను కలెక్టర్ ఆదేశించారు.

భూముల రీసర్వే

- 15 నుంచి రెండో విడత కార్యక్రమం
- మరో 58 గ్రామాల్లో రీసర్వేకు శ్రీకారం
- రోవర్లతో స్పీడుగా కొలతలు



(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రెండో విడత భూ రీసర్వే కొనసాగనుంది. తొలి విడత పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలో 24 మండలాల్లోని 24 గ్రామాల్లో భూముల రీసర్వే జనవరి 20న ప్రారంభమైంది. ఆయా గ్రామాల్లో సరిహద్దులు వేసే ప్రక్రియ పూర్తయితే దాదాపు సర్వేలో లెక్కలు సరిపోలే అవకాశం ఉంది. మొత్తం 24,606 ఎకరాల భూముల సర్వేను లెక్క తేల్చుతున్నారు. దీంతో రెండో విడతగా అవే మండలాల్లో రెండేసి గ్రామాల చొప్పున అదనంగా భూముల రీసర్వే జరపాలని రాష్ట్ర భూపరిపాలనా కమిషనర్ (సీసీఎల్‌ఏ) సిసోడియా ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రెండో విడతగా మరో 58 గ్రామాల్లో ఈ నెల 15 నుంచి రీ సర్వే జరపడానికి అధికారులు గ్రామాలను ఎంపిక చేస్తున్నారు. మండలాల్లో తహసీల్దార్ల నుంచి లెక్కలు తీసుకుంటున్నారు. 14 నాటికి పూర్తి భూముల డేటాను సేకరించి కార్యాచరణకు దిగనున్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో గందరగోళం

గత వైసీపీ ప్రభుత్వంలో రీసర్వే పేరుతో గందరగోళం చేసింది. భూముల కొలతల్లో భారీగా తేడాలు వచ్చాయని చాలాచోట్ల రైతులు గగ్గోలు పెట్టారు. తాము నష్టపోతున్నామని కూటమి ప్రభుత్వానికి మొరపెట్టుకోవడంతో భూముల తేడాల్లో ప్రక్షాళనకు సర్కార్ నడుం బిగించింది. గ్రామాల్లో మొదటి విడత సర్వేపై రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా బడా భూస్వాముల వివరాల సర్వే అక్కడక్కడ పూర్తి కాలేదని సమాచారం. వారంతా భూములున్న చోట్ల ఉండకపోవడంతో లెక్కలపై కుస్తీ పడుతున్నారు. సీసీఎల్‌ఏ అన్ని జిల్లాల్లో పర్యటించడంతో అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సర్వేకు ఉపక్రమిస్తున్నారు. మొన్నటి వరకు ఎన్నికల కోడ్ వల్ల జిల్లాలో పర్యటించలేదు. త్వరలో ఆయన జిల్లాలో భూముల రీసర్వేను పరిశీలించే అవకాశం ఉందంటున్నారు. ప్రస్తుతానికి సర్వే చివరి దశకు చేరింది. గ్రౌండ్ ట్రూతింగ్ (జీటీ)పూర్తయ్యింది. గ్రామాలు, బ్లాక్‌లు మొత్తం ఎకరాలు, ఖాతాల కింద వర్గీకరణ చేస్తున్నారు.

సర్వేలో ఆధునిక సాంకేతికత

భూముల రీసర్వేలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూముల వర్గీకరణ చర్యలు చేపట్టాలని, ప్రత్యేక మ్యాప్‌లతో అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేలకు వెళ్లాలని భూముల రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉండాలని సీసీఎల్‌ఏ సూచనలు చేస్తూనే ఉన్నారు. భూసేకరణ ప్రీ హోల్డ్, డిజిటలైజేషన్, జాయింట్ ఎల్‌పీఎంలు రూపకల్పన చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. జేసీ ధాత్రిరెడ్డి ఎప్పటికప్పుడు డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, సర్వే ల్యాండ్ రికార్డు ఏడీ అన్సారీ, క్షేత్రస్థాయిలో తహసీల్దార్లతో పర్యవేక్షణ చేస్తున్నారు. పాత విధానంలో గొలుసుకట్టు, టేప్‌లతో కొలిచే పద్ధతికి స్వస్తి పలికి గ్లోబల్ నేవిగేషన్ శాటిలైట్ సిస్టమ్ ద్వారా రోవర్లను ఉపయోగించి భూముల సర్వే చేస్తుండడంతో లెక్కలు సరిగ్గా తేలుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. బేస్ స్టేషన్లు పెదవేగి, జీలుగుమిల్లిలో పరిధిలో రోవర్ల విధానంతో సర్వే చేస్తున్నారు. 13 కిలోమీటర్ల పరిధిలో రోవర్ల డేటాను రిసీవ్ చేసుకుని పనిచేస్తాయి. భూముల రీసర్వేతో గ్రామాల్లో భూ వివాదాలకు చెక్ పడనుంది.



కల్యాణ పీటలపై కొల్లేటికోట శ్రీజలదుర్గ గోకర్ణేశ్వరస్వామి, అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా జలదుర్గా గోకర్ణేశ్వరస్వామి కల్యాణం

కైకలూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి):కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి కల్యాణ మహోత్సవం మంగళవారం భక్తుల కోలాహలం మధ్య వేదపండితుల మంత్రోచ్ఛరణలతో వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి గోకర్ణపురం నుంచి గోకర్ణేశ్వర స్వామివారిని పల్లకిపై ఊరేగింపుగా పెద్దింటి అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చి జలదుర్గా అమ్మవారికి గోకర్ణేశ్వరస్వామికి కల్యాణం నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి దేవదాయ, ధర్మాదాయ శాఖ నుంచి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను అందజేశారు. వేలాదిమంది భక్తులు కల్యాణమహోత్సవాన్ని తిలకించారు. మంగళవారం అమ్మవారికి నవవరణార్చన, కలశపూజ, బలిహరణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ, భక్తులకు ఉచిత ప్రసాదాన్ని మదునూరి కొండరాజు దంపతులు అందజేశారు. ఈవో కూచిపూడి శ్రీనివాసు ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించారు.

రేపటి నుంచి ఆర్అండ్ఆర్ గ్రామసభలు

వేలేరుపాడు, మార్చి 11(ఆంధ్రజ్యోతి):మండలంలో 41.15 కాంటూరు పరిధిలోకి నూతనంగా చేర్చిన 14 గ్రామాల్లో ఆర్ అండ్ ఆర్, నిర్మాణాలకు అవార్డు విచారణకు ఈ నెల 13 నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ డీవీ.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. 13న కొత్తూరు, తూర్పుమెట్ట గ్రామాలకు సంబంధించి నాళ్ళవరం గ్రామ సచివాలయం, బోళ్ళపల్లి, యడవల్లి, చిట్టింరెడ్డిపాలెం, యర్రమెట్ట గ్రామాలకు బోళ్ళపల్లి ఎంపీపీ పాఠశాలలో, 15న టేకూరు, చింతలపాడు, సిద్ధారం గ్రామాలకు టేకూరు ఎంపీపీ స్కూల్, 17న కాచారం గ్రామానికి కోయిదా గ్రామ సచివాలయం, 18న పేరంటాళ్ళపల్లి గ్రామానికి, ఫౌండేషన్ స్కూల్ పేరంటాళ్ళపల్లిలో టేకుపల్లి గ్రామానికి ఫౌండేషన్ స్కూల్ టేకుపల్లిలోనూ, కాకిసనూరు గ్రామానికి ఫౌండేషన్ స్కూల్ కాకిసనూరులో గ్రామసభలు జరుగుతాయని వివరించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీ.శ్రీనివాస్‌రెడ్డి, పోలవరం ప్రాజెక్టు కుడికాల్వ యూనిట్-2 సిబ్బంది పాల్గొంటారని తహసీల్దార్ తెలిపారు.

అభయారణ్యంలో
వన్యప్రాణుల వేట
ఇతర ప్రాంతాల నుంచి గొర్రెల కాపరుల చొరబాటు
బోట్లపై గోదావరిలో చేపల వేట 6

దిగొచ్చిన ఇసుక
ఆరు యూనిట్లు రూ.10 వేలు
ర్యాంపులలో ఆగని దందా 7

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

జిల్లాలోని ఆర్టీసీ డిపోలు, బస్టాండ్లలో నెలకొన్న సమస్యలు, బస్సుల రాకపోకల్లోని ఇబ్బందులపై 12వ తేదీ బుధవారం ఉదయం 11-12 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' నిర్వహించనుంది. ప్రజలు, ప్రయాణికులు
94406 25154
నెంబరుకు ఫోన్ చేసి జిల్లా ప్రజా రవాణాధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్‌కు సమస్యలను వివరిస్తే.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

అధ్యక్షా..


అసెంబ్లీలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రాజు

నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయండి

బడ్జెట్ సెషన్స్‌లో భాగంగా మంగళవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రసంగించారు.

ఆయన మాటల్లోనే..

మా గోపాలపురం వ్యవసాయాధారిత సాధారణ నియోజకవర్గం. విద్యావంతులైన యువత ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. నైపుణ్యాభివృద్ధితో యువతకు ఉజ్వల భవిష్యత్‌ను అందించగలుగుతాం. మా నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు అధికంగా ఉన్న చోట ఈ సెంటర్ల ఏర్పాటుకు మంత్రి నారా లోకేశ్ ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నాను. విద్యా విధాన ప్రక్షాళన, నిరంతర పర్యవేక్షణతో బాధ్యతాయుత పౌరులను ఈ దేశానికి ఇచ్చేలా మంత్రి లోకేశ్ చేస్తున్న యజ్ఞానికి ప్రతీ ఒక్కరం అండగా ఉంటామని మీ ద్వారా తెలియజేస్తున్నాం అధ్యక్షా.

- ద్వారకాతిరుమల, ఆంధ్రజ్యోతి

23న ఉల్లాస్ పరీక్షలు

ఏలూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిరక్షరాస్యులైన వయోజనులకు ఈ నెల 23న నిర్వహించే ఉల్లాస్ పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై వయోజన విద్య, విద్యాశాఖ అధికారులతో మంగళవారం ఆమె సమీక్షించారు. అక్షరాస్యత శిక్షణ పూర్తిచేసిన 7,321 మంది పరీక్ష రాయనున్నారని, 732 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 23న 10 గంటల నుంచి 5 గంటల వరకు అంగన్‌వాడీ సెంటర్లు, పాఠశాలల్లో పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఎంఈవోలు, సెర్ప్ ఏపీఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

మన బడి-మన భవిష్యత్‌కు రూ.14.81 కోట్లు

ఏలూరు అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం మన బడి - మన భవిష్యత్ పథకంలో జిల్లాకు రూ.14.81 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు తరగతి గదులు, ప్రహరీ, తదితర నిర్మాణ పనులు చేపట్టవచ్చు. పాఠశాలల వివరాలు, నిధుల విడుదల, వినియోగంపై మార్గదర్శకాలు రావాల్సి ఉంది. సంబంధిత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, పాఠశాల విస్తీర్ణం ప్రామాణికంగా నిధులు కేటాయిస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరి కొద్ది రోజుల్లోనే ముగియనుండగా తాజాగా మంజూరైన నిధుల విడుదల, మార్గదర్శకాలు, పాఠశాలల వారీగా గుర్తించిన పనులకు టెండర్ల నోటిఫికేషన్ జారీ, లేదా నామినేషన్ల పద్ధతిపై ఖరారు, వర్క్ ఆర్డర్ జారీ తదితర ప్రక్రియలు గడువులోగా పూర్తయ్యే అవకాశాలపై సందేహాలు నెలకొన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు పేరిట జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన 100 అదనపు తరగతి గదుల నిర్మాణం అప్పట్లో నిధుల లేమితో అర్ధాంతరంగా నిలిచిపోయాయి.





సూరీడు నిప్పులు చెరిగాడు.. మంగళవారం ఎండ వేడికి జనం అల్లాడారు..పది దాటిన తరువాత బయటకు వచ్చేందుకు భయపడ్డారు.. ఏలూరులో కనిపించిన ఈ దృశ్యాలే అందుకు రుజువు..కొనేవారు రాక రోడ్డు పక్క వ్యాపారులు డీలా పడ్డారు.. మధ్యాహ్నం ఫ్లైఓవర్‌పై ఒక్క మనిషి జాడ కూడా కనిపించలేదు. కొబ్బరి బొండాలకు గొడుగు పెట్టి వ్యాపారి నీడపాటుకు చేరాడు..



-ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, ఏలూరు



పడమటి సంధ్యారాగం

ఉదయం నుంచి నిప్పులు చెరిగిన సూరీడు సాయంత్రం చల్లబడ్డాడు.. మెల్లగా కొబ్బరి ఆకుల మధ్య నుంచి పడమర కొండల్లోకి జారుకుంటున్నాడు.. చెరువులోంచి తొంగిచూస్తూ శుభరాత్రి చెపుతున్నాడు.. తణుకు సమీపంలో కనిపించిన ఈ సుందర దృశ్యాన్ని పలువురు ఆసక్తిగా తిలకించారు.. తమ సెల్ ఫోన్లలో బంధించారు..

-ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, భీమవరం

అభయారణ్యంలో వన్యప్రాణుల వేట

ఇతర ప్రాంతాల నుంచి గొర్రెల కాపరుల చొరబాటు

నిబంధనలకు విరుద్ధంగా బోట్లపై గోదావరిలో చేపల వేట

పాపికొండల అభయారణ్యంలో ఇతరులెవరూ అడుగు పెట్టలేరు. ఎవరైనా వెళ్లాలంటే అటవీ శాఖ అధికారుల అనుమతి తప్పనిసరి.. పోలవరం ప్రాజెక్టు ఎగువ నుంచి కుక్కునూరు, వేలేరుపాడు వరకు గోదావరి నదికి ఇరు వైపులా సుమారు 45 కిలోమీటర్ల మేర అభయారణ్యం విస్తరించి ఉంది. ఈ అటవీ ప్రాంతలో అనేక జంతులు జాతులు ఉన్నాయి..వేటగాళ్లు అటవీ శాఖ అధికారుల కళ్లు గప్పి వన్యప్రాణులను వధిస్తున్నారు.. అంతేకాదు ఇతర ప్రాంతాల నుంచి మత్స్యకారులు వచ్చి బోట్లపై చేపల వేట సాగిస్తున్నారు.. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు...



పాపికొండల అభయారణ్యం పరిధి నదిలో చేపల వేట బోట్లు

పోలవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పాపికొండల నేషనల్ పార్కు పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వన్యప్రాణులు, గోదావరిలో చేపట వేట యధేచ్ఛగా కొనసాగుతోంది. పేరంటాలపల్లి శివక్షేత్రం వరకూ గోదావరి నదికి ఇరువైపులా పాపికొండల నేషనల్ పార్కు విస్తరించి ఉంది. ఈ రిజర్వు ఫారెస్టు ప్రాంతంలో పది సంవ త్సరాల క్రితం వరకూ నదీపరివాహక ప్రాంతాలకు ఇరువైపులా గిరిజన గ్రామాలు ఉండేవి. ప్రాజెక్టు నిర్మాణంలో గిరిజన గ్రామాలను పునరావాసాలకు తరలించడంతో ఆయా ప్రాంతాల్లో వన్యప్రాణుల సంచారం, సంతతి పెరుగుతూ వస్తున్నది. అడవి పందులు, కొండగొర్రెలు, గొర్రగేదెలు, నెమళ్ళు, జింకలు, ఎలుగుబంట్లు, కుందేళ్ళు, నక్కలు, వివిధ జాతుల పాములు, నక్కలు, నదిలో మొసళ్ళు సంచరిస్తూ తమ సంతతిని వృద్ధి చేసుకుంటున్నాయి. గతేడాది నుంచి తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల నుంచి గొర్రెల కాపరులు, ధవళేశ్వరం, కొవ్వూరు ప్రాంతాల నుంచి మత్స్యకారులు పోలవరం ప్రాజెక్టు ఎగువ భాగానికి నేషనల్ పార్కులోపలికి చొరబడి వన్యప్రాణులను, గోదావరిలో చేపలను వేటాడి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ములు చేసుకుంటున్నారు. గొర్రెల కాపరులు నాటు తుపాకులు, వన్యప్రాణులను పట్టుకునే ఉచ్చులతో అడవి పందులను, కొండ గొర్రెలను, నెమళ్ళను, అడవి కోళ్ళను ఇతర వన్యప్రాణులను వేటాడి మాంసాన్ని మైదాన ప్రాంతాలకు తీసుకువచ్చి కిలో వెయ్యి నుంచి 2 వేల వరకూ అమ్మకాలు చేసి సొమ్ములు చేసుకుంటున్నారు. దళారీల ద్వారా పట్టణ ప్రాంతాలకు, ఇతర ప్రాంతాలకు ఎగుమతులు సైతం చేస్తున్నారు. ఆయా ప్రాంతాలలో బీటు విధులు నిర్వహిం చాల్సిన బీటు ఆఫీసర్లు, సిబ్బంది పోలవరం అటవీశాఖ కార్యాలయాలకు ఇళ్ళకు పరిమితమై ఉండడం, విధులు నిర్వహించాల్సిన ప్రాంతాలకు తరచూ వెళ్లకపోవడం వల్ల అడవిలో వేటలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఇక గోదావరి నదిలో ప్రాజెక్టు ఎగువన నిషేధిత దెయ్యం వల (అప్పుడే పుట్టిన చిన్నచేప పిల్లలను సైతం పట్టే ఐలా వల)తో వేటాడి వేటాడిన ప్రాంతంలోనే ఆ చేపలను ఎండబెట్టి అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా గొందూరు గండిపోశమ్మ ఆలయ సమీపంలోకి అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలి స్తున్నారు. నిత్యం గోదావరిలో చిన్న పెద్ద చేప లతో సహా సుమారు ఐదు నుంచి పది టన్నుల చేపలను పట్టి రవాణా కొనసాగిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మత్స్య సంపద పూర్తిగా నశిస్తుందని పోలవరం పరిసర ప్రాంతాల మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టుకి కుడి ఎడమల భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న చెక్‌పోస్టులు, పోలవరం మండలంలో పాపికొండల నేషనల్ పార్కులోకి వెళ్లే పలుమార్గాల అటవీశాఖ చెక్‌పోస్టుల సిబ్బంది విధుల అలసత్వం, చేతివాటం పాపికొండల నేషనల్ పార్కులోకి చొరబాటుకి కారణాలని స్థానికులు చెబుతున్నారు.



ట్రాక్టరుపై తరలిస్తున్న మరపడవ



శ్రీవారి కొండపై దాహం తీరుస్తున్న దాతలు

ద్వారకాతిరుమల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చిన్నతిరుమలేశుని క్షేత్రానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన జలప్రసాదం వరప్రసాదంగా మారింది. విశాఖకు చెందిన దాత రాజు వేగేశ్న ఫౌండేషన్ ఇండియా లిమిటెడ్ , హైదరాబాద్‌కు చెందిన దివీస్ సంస్థ ఆర్థిక సహకారం దాదాపు రూ. 59 లక్షలతో దేవస్థానం నిర్మించిన 9 వాటర్ ప్లాంటులు భక్తుల దాహార్తి తీరుస్తున్నాయి. శ్రీవారి దర్శనార్థం క్షేత్రానికి వచ్చే వేలాది మంది యాత్రికులకు స్వచ్ఛమైన తాగునీరు అందుతోంది. చిన వెంకన్న ఆలయాన్ని నిత్యం వేలాదిమంది భక్తజనులు దర్శిస్తున్నారు. శని, ఆదివారాల్లో అయితే 20 నుంచి 30 వేలమంది సందర్శిస్తున్నారు. గతంలో దేవస్థానం బోరు నీటినే భక్తులకూ సరఫరా చేసేది. కొండప్రాతం, అందులోనూ సుద్దనేల కావడంతో ద్వారకాతిరుమల ప్రాంతంలో బోర్ల నుంచి వచ్చే మంచినీటిలో ఎక్కువ శాతం సుద్ద కలిసేది. స్వచ్ఛమైన తాగు నీటి కోసం క్షేత్రానికి వచ్చిన భక్తులు అల్లాడేవారు. వేసవిలో ఈ కష్టాలు మరింత ఎక్కువగా ఉండేవి. ఈ ప్లాంట్‌ల ఏర్పాటుతో భక్తుల కష్టాలు తొలిగాయనే చెప్పొచ్చు. పాతకల్యాణమండపం, కొండపైన అనివేటి మండప ప్రాంతంలోనూ, సప్తగోకులం, వకుళమాత అన్నప్రసాద భవనంలో మినరల్ వాటర్ ప్లాంట్లను నిర్మించారు.



అలంపురం ట్రస్టు ఆసుపత్రికి వచ్చిన బాధితులు

సామాన్యులకు ఖరీదైన వైద్యం

అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యులు

ఉచితంగా వైద్య సేవలు.. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు

పెంటపాడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వైద్యం చాలా ఖరీదైపోయింది. పేద మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ వైద్యం ఇప్పటికీ అందని ద్రాక్షే. అలంపురం వెంకటరమణా సేవా చారిటబుల్ ట్రస్టు ఆసుపత్రి పేదలుకు కూడా కార్పోరేట్ వైద్య సాయం అందిస్తున్నది. ప్రముఖ వైద్యులను ట్రస్టుకు తీసుకువచ్చి ఉచితంగా వైద్య సేవలందిస్తుంది. దూరప్రాంతాల నుంచి ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. సోమవారం నుంచి శనివారం వరుకూ జనరల్, డెంటల్, ఫిజియోథెరఫీ సేవలు అందిస్తున్నారు.ప్రతీ నెల మూడవ ఆదివారం విజయవాడ నుంచి ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ తీగల రమేష్ వస్తుంటారు. తల, మెదడు, వెన్నుముక, నరాలకు సంబందించి వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారు.ప్రతీ రెండు నెలలకు ఒకసారి హైదరాబాద్ నుంచి ప్రముఖ షుగర్ స్పెషలిస్టు డాక్టర్ రాజశేఖర్ వస్తుంటారు. పాదాలలో తిమ్మిర్లు, స్పర్శ తగ్గడం, రక్త ప్రసరణ తగ్గడం, మానని పుండ్లు, ఇన్ఫెక్షన్ వల్ల కుళ్ళిపోయిన వాటికి ఉచితంగా చికిత్స చేస్తారు. ఈయన ఇక్కడ రెండు రోజులు ఉంటారు. తొలిరోజు పరీక్షలు నిర్వహించి రెండవ రోజు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్‌లు ఆసుపత్రి ప్రాంగణంలోనే నిర్వహిస్తారు. ఆపరేషన్‌కు సంబందించిన ఎక్విప్‌మెంట్ అంతా ఈ ఆసుపత్రి లోనే సమకూర్చారు. ప్రతీ గురువారం రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్యులు వస్తుంటారు. వచ్చిన వారికి ఆసుపత్రి వద్దే ప్రతీ రోజు ఉచితంగా భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేశారు. అన్ని రకాల రక్తపరిక్షలతో పాటూ , ఈసీజీ, టూడీ ఈకో, ఆల్ట్రాసౌండ్ తదితర వైద్య పరీక్షలు కూడా ఉచితంగా చేస్తారు.

• చికిత్స బాగా చేస్తున్నారు



కొన్ని రోజులుగా నడుం నొప్పితో బాధ పడుతున్నాను.. ట్రస్టు ఆసుపత్రికి ప్రతీ నెల డాక్టర్ తీగల రమేష్ వస్తున్నారని తెలిసి ఇక్కడకు వచ్చాను. ఇప్పటికి రెండు సార్లు వచ్చాను. చికిత్స బాగా చేస్తున్నారు. ఇప్పుడు కొంత ఉపశమనంగా ఉంది.

- తొంట భాగ్యలక్ష్మి, తణుకు

• మాలాంటివారికి ఎంతో మేలు



మెడనరాలు లాగుతున్నాయని చికిత్స చేయించుకునేందుకు ఆసుపత్రికి వచ్చాను. విజయవాడ వెళ్ళి రమేష్ గారికి చూపించుకోవడం కష్టం. మాలాంటి వాళ్ళ గురించి ప్రత్యేక వైద్యులను కూడా ఆసుపత్రికి తీసుకువచ్చి ఉచితంగా వైద్యం అందస్తున్నారు.

- దిర్సిబోయిన నాగేశ్వర రావు, మోదుగుంట

సద్వినియోగం చేసుకోవాలి



ప్రజలకు ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందించాలన్న ఉద్దేశంతోనే ట్రస్టు ఆసుపత్రి ప్రారంభించాం. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశాం. వచ్చిన వారు భోజనానికి ఇబ్బంది పడకూడదని ఇక్కడే ఉచిత భోజన వసతులు కూడా ఏర్పాటు చేశాం. ప్రజలు ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి.

- కొలనువాడ పెదకృష్ణంరాజు, ట్రస్టు చైర్మన్

ఆశ..నిరాశ



పుచ్చకాయలు లోడు చేస్తున్న రైతులు

పుచ్చ రైతుల్లో ఆనందం

ఆశాజనకంగా దిగుబడి

ధర అనుకూలం.. టన్ను రూ.14 వేలు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పుచ్చదిగుబడి ఆశాజనకంగా ఉంది. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో రైతులు పుచ్చపాదులు వేస్తూ లాభాలు బాట పడుతున్నారు. ఒకే పంట చేలో రెండు పంటలు పండిస్తూ కూలీల ఖర్చు దుక్కి ఖర్చు లేకుండా పుచ్చ సాగుచేస్తూ పలువురికి ఆదర్శంగా నిలు స్తున్నారు. పుచ్చపాదు వేసిన చేలో ఎకరాకు 18 నుంచి 20 టన్నుల వరకూ దిగుబడి సాధిస్తున్నారు. సాదారణంగా జనవరి నుంచి మే వరకూ ఈ సాగు చేస్తుంటారు. ఇటీవల ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వేడి నుంచి ఉపసమనం పొందేం దుకు ఎక్కువ మంది ప్రజలు పుచ్చకాయలు కొనేందుకు ఉత్సాహం చూపుతున్నారు. గతంలో జిల్లాకు ఖమ్మం, తమిళనాడు, పాండిచ్చేరి తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున దిగుమతులు జరిగేవి. ప్రస్తుతం జిల్లాలో పుచ్చకాయల పంట సాగుచేయడంతో మన ప్రాంత రైతులు పుచ్చ పంటపై లాభాలు గడిస్తున్నారు. మన ప్రాంతాల్లో పండే పుచ్చకాయలు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లోని తాడేపల్లిగూడెం, భీమవరం, నరసాపురం, తణుకు, పాలకొల్లు తదితర పట్టణాలతో పాటు ఇతర జిల్లాలకు రవాణా చేస్తున్నారు.

మేలైన రకాలు ఇతర రాష్ట్రాలకు..

జిల్లాలో పండించే పుచ్చపంటలో మేలైన రకాల పుచ్చను గ్రేడ్ చేసి ఏ-గ్రేడ్ పుచ్చకాయలను ఇతర జిల్లాల్లోని మాల్స్‌కు తరలి స్తున్నారు. ముఖ్యంగా కృష్ణ, వసుధ, సూర్య రకాలైన పుచ్చ లను మేలైన రకాలుగా భావిస్తుంటారు. మేలైన పుచ్చకాయలు ఒక్కోటి 10 నుంచి 12 కేజీల వరకూ పుచ్చకాయలు దిగుబడి వస్తుండ టంతో రైతుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.



కడియద్దలో పుచ్చకాయల తోట

• గతంలో కంటే సాగు ఖర్చులు పెరిగాయి



నాలుగు ఎకరాల్లో పుచ్చపంట వేశాను. గతంలో పంట వేసేం దుకు పెద్దగా ఖర్చు అయ్యేది కాదు. ఇప్పుడు పురుగుల దాడికి భారీగా మందులు పిచికారీ చేయాల్సి వస్తోంది. దీంతో వచ్చే ఆదాయంలో 50 శాతం పైగా ఖర్చవుతోంది.

- బిక్కిన రామకృష్ణ, రైతు, కడియద్ద

• దిగుబడి ఆశాజనకంగా ఉంది



అక్టోబరు నుంచి పుచ్చపాదులు వేస్తుంటాం. ఈసారి కాస్త ఆలస్యంగా వేశాం. కానీ దిగుబడి ఆశాజనకంగా ఉంది. గతంతో పోలిస్తే పంట బాగానే ఉంది. మేలైన రకం పుచ్చ కాయలకు మంచి డిమాండ్ ఉంది. టన్ను రూ.14 వేల నుంచి 12 వేల వరకూ ధర పలుకుతోంది.

-వాకా ప్రసాద్, రైతు, జగ్గన్నపేట

సపోటా కనుమరుగు

తీరప్రాంతంలో తగ్గిపోతున్న తోటలు

చెట్లను నరికేస్తున్న రైతులు

మొగల్తూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తీరంలోని ఇసుక భూముల్లో విస్తారంగా ఉండే సపోటా తోటలు నేడు కనమరుగవుతున్నాయి. తీర ప్రాంతమైన మొగల్తూరు మండలంలోని మెరక తోటల్లో ఇసుక తెన్నెలు అధికంగా ఉండటం, మంచు సమయంలో ఇక్కడ తేమ గల వాతావరణం ఉండటంతో వేలాది ఎకరాల్లో సపోటా తోటలు ఉండేవి. మొగల్తూరు, రామన్నపాలెం, కేపీ పాలెం, పేరుపాలెం, మోడి, ముత్యాలపల్లి, కాళీపట్నం గ్రామాల్లో తోటల విస్తీర్ణం అధికంగా ఉండేది. నేడు ప్రత్యేక సపోటా తోటలు కేవలం 100 ఎకరాల్లోపు మాత్రమే ఉన్నాయి. ఇతర తోటల్లో అంతర పంటగా మాత్రమే సపోటా చెట్లు విస్తరించాయి. ఇప్పటికీ మోడి, ముత్యాలపల్లి గ్రామాల్లో మాత్రమే చెప్పుకోదగ్గ సపోటా సాగు ఉంది. ఈ తోటలకు ఎటువంటి ఎరువులు, పురుగుమందులు, కనీస సస్యరక్షణ చర్యలు చేయకుండానే ఫలసాయం వచ్చేవి. ఒకప్పుడు వంద సపోటా కాయలు రూ.10 ఉండగా నేడు రూ.200లకు పైబడి అమ్ముతున్నారు. ధర ఇంత పెరిగినా సపోటా కాయలు చెట్టు నుంచి కోయడానికి కూలిధరలు కూడా రాని పరిస్థితి నెలకొంది. సపోటా చెట్లు కొమ్మలు విరివిగా వచ్చి ఎక్కువ భూ బాగాన్ని ఆక్రమిస్తాయి. చెట్టుకు పండిన పండ్లు కోయకపోతే తీపి తనంతో తోటల్లో చీమలు మరింత విస్తరిస్తున్నాయి. దీంతో తమ భూముల్లో పూర్వం నుంచి వస్తున్న సపోటా సాగు లాభదాయకంగా లేకపోవడంతో ఈ చెట్లను నరికేస్తున్నారు. ఈ తోటల్లో ఉండే ఇసుకకు డిమాండ్ ఏర్పడటంతో తోటలు నరికేసి ఇసుకను లక్షలాది రూపాయలకు అమ్మేసుకుంటున్నారు.దీనికితోడు గ్రామీణ ప్రాంతాల్లోనూ రియల్ వెంచర్లు పెరగడంతో ఈ భూములు ధరలకు రెక్కలు రావడంతో సపోటా తోటలు కనుమరుగువుతన్నాయి.



మొగల్తూరులో సపోటా తోటలు

సపోటా స్పెయిన్ దేశానికి చెందినది. మధ్య అమెరికాలో ఈ చెట్లు ఎక్కువ. స్పెయిన్ నుంచి నౌకాయానం చేసినవాళ్ళు ఈ పండ్ల గింజలను భారతదేశానికి తెచ్చారు. అలా వచ్చిన ఈ చెట్లు ఇప్పుడు భారతీయులకు ఇష్టమైనదిగా మారింది.

సపోటాతో ఆరోగ్య ప్రయోజనాలు

ప్రకృతి సిద్ధంగా లభించే సపోటా పండ్లను చాలామంది ఇష్టంగా తింటుంటారు. ఇందుల్లో శరీరానికి కావల్సిన అనేక రకాల పోషకాలు లభిస్తాయి. విటమిన్ ఏ, బీ, సీ, ఖనిజాలు పొటాషియం పుష్కలంగా లభ్యమవుతాయి. శరీరానికి శక్తిని అందించడమే కాకుండా రక్తపోటును నియంత్రించి ఫైబర్, ఫాస్పరస్, కాల్షియం అందిస్తాయి. రక్త శుద్ధి, ఎముకుల ఆరోగ్యం, గుండె సమస్యలకు చెక్ పెట్టడం, జీర్ణ వ్యవస్థను మెరుగుపరిచేందుకు సపోటాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇన్ని ప్రయోజనాలు ఉన్న ఈ సపోటా సాగును ప్రభుత్వం ప్రోత్సహించి రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లు కోసే కూలీలను ఏర్పాటు చేస్తే సాగు కొనసాగించే అవకాశం ఉందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.



చేపల చెరువుల్లో యాజమాన్య పద్ధతులపై బ్రోచర్‌ను విడుదల చేస్తున్న డా.శివన్నారాయణ

భూసారం, దిగుబడిపై దృష్టి పెట్టాలి

ఉండి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దత్తత గ్రామాల్లో విస్తరణ కార్యక్రమాలు ఎక్కువగా చేసి రైతుల అభివృద్ధికి దోహదపడాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం విస్తరణ సంచాలకులు డా.జి.శివన్నారాయణ అన్నారు. మంగళవారం ఎస్‌ఆర్‌పీ అగ్రహారంలోని కృషి విజ్ఞానకేంద్రంలో శాస్త్రీయసలహా సంఘ సమావేశం జరిగింది. ఈసందర్భంగా డా.జి.శివన్నారాయణ మాట్లాడుతూ రైతులకు కృషివిజ్ఞానకేంద్రాల ప్రాముఖ్యత తెలిసేలా కార్యక్రమాలు చేయాలని సూచించారు. పంట దిగుబడి, ఆదాయం పెంచడం, ఖర్చులు తగ్గించడం, భూసారం పెంచడం వంటి అంశాలపై శాస్త్రవేత్తలు దృష్టి సారించాలన్నారు. మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన ఉపసంచాలకులు డా.టి.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు డిజిటల్ మార్కెటింగ్‌పై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వర్లు, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.మల్లికార్జునరావు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ డా.దండు జగన్నాథరాజు, జిల్లా ఉద్యానవన అధికారి దేవానంద కుమార్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టరు డా. హుస్సేన్, మత్స్యవిభాగం అసిస్టెంట్ డైరెక్టరు జి.శ్రీని వాస రావు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేపల చెరువుల్లో యాజమాన్య పద్ధతులపై బ్రోచర్ ఆవిష్కరించారు.అనంతరం ఉండి కేవీకేలో పండిస్తున్న వివిధ పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. మహదేవపట్నం గ్రామానికి చెందిన బొక్కా శ్రీని వాస్ ఏర్పాటు చేసిన ఆర్గానిక్ స్టాల్స్‌ను పరిశీలించారు.

రైతులకు నైపుణ్య శిక్షణ ఉండాలి

వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా దిగుబడులను ఎట్లా పెంచాలనే విషయాలపై రైతులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నదని డా.జి.శివన్నారాయణ అన్నారు. ఎన్ఆర్‌పిఅగ్రహారంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుల ఆదాయం పెరగాలంటే వ్యవసాయంలో అధిక దిగుబడులు వస్తేనే సాధ్యమవుతుందన్నారు. కృషివిజ్ఞాన కేంద్రాల్లో రైతులకు శిక్షణ తరగతులు ద్వారా నైపుణ్యం పెంచడానికి కృషిచేస్తున్నట్లు తెలి పారు. జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో దాళ్వా సాగును 2లక్షల 21వేల ఎకరాలలో రైతులు చేపట్టార న్నారు. ఈసాగు మంచి దశకు చేరుకుందన్నారు. మన ప్రాంతంలో గుర్రపుడెక్క ఎక్కు వగా వస్తుందని, దీనిని డ్వాక్రాగ్రూపు మహిళల ద్వారా దాని ఆకు, కాండం నుంచి నార తీసి మ్యాట్‌లు తయారు చేసే విధంగా కేవీకేలలో మహిళలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాలు చేయాలని సూచించామన్నారు.

నన్నయ వీసీ ప్రసన్నశ్రీకి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

దివాన్‌చెరువు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీకి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్‌లో గ్లోబల్ ఏంజెల్స్ జేసీటీ సహకారంతో ప్రతిష్ఠాత్మక హెచ్ఎంటీవీ మాతృశక్తి అవార్డు-2025 కార్యక్రమంలో వీసీ ప్రసన్నశ్రీకి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ అవార్డును అందజేశారు. ఈ సదస్సులో నిర్వాహకులు వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ గురించి ప్రస్తావిస్తూ అంతరించిపోతున్న 19 గిరిజన భాషలకు లిపిని రూపొందించిన ప్రముఖ విద్యావేత్త అని, విద్యారంగంలో చేసిన కృషికి కేంద్ర ప్రభుత్వం నారీశక్తి పురస్కారాన్ని అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వైస్‌చాన్సలర్ బాధ్యతలు స్వీకరించిన తొలి తెలుగు గిరిజన మహిళగా గుర్తింపు పొందారని, విద్యార్థులకు వసతి గృహంలో అందిస్తున్న భోజనం రుచిగా, శుచిగా ఉండాలని సూచిస్తూ, విద్యార్థులకు గోరుముద్దలు తినిపించి సొంత బిడ్డల్లా ఆదరిస్తున్నారంటూ ప్రసన్నశ్రీని ప్రశంసించారు.



నన్నయ వీసీ ప్రసన్నశ్రీకి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ అవార్డు అందిస్తున్న దృశ్యం



ఏలూరులో ఆందోళన చేస్తున్న బ్యాంకుల ఉద్యోగులు

24, 25 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె

ఏలూరు కార్పొరేషన్/పాలకొల్లు అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా ఈ నెల 24, 25 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు సమ్మె చేస్తున్నట్టు ఏలూరు జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం అధ్యక్షులు డి.శ్రీనివాస్‌మోహన్ తెలిపారు. సమ్మెలో భాగంగా మంగళవారం సాయంత్రం ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద బ్యాంకు ఉద్యోగులు యుఎఫ్‌బీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, వారానికి ఐదు రోజులు పని దినాలు కల్పించాలని, తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అవుట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలని, ఐబీఏతో చేసుకున్న ఒప్పందం ప్రకారం మిగిలిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వలే గ్రాడ్యుటి రూ.25 లక్షలకు పెంచి ఇన్‌కంటాక్స్ రాయితీ ఇవ్వాలని, బ్యాంకు ఉద్యోగులపై జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. ఏఐబీఈఏ నాయకులు ఎన్.లక్ష్మణరావు, ఏఐబీవోసీ నాయకులు శ్రీనివాస్, ఎన్‌సీబీఈ నాయకులు రత్నవిమల్, రిటైర్డ్ బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కె.జె.సత్యనారాయణ, వంకినేని కిషోర్‌కుమార్ పాల్గొన్నారు. పాలకొల్లులోని ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద రీజియన్‌లోని బ్రాంచ్‌ల సిబ్బంది మంగళవారం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

ఉలిక్కి పడిన చిత్తపూరు గ్రామస్తులు

కానిస్టేబుల్‌ను కత్తితో పొడిచిన అంతర్ రాష్ట్ర దొంగ

చాట్రాయి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పరిధిలోని సత్తుపల్లి పట్టణంలో మంగళవారం ఐడీ పార్టీ కానిస్టేబుల్ నరేశ్‌ని కత్తితోపొడిచి పరారైన అంతర్ రాష్ట్ర దొంగ తిరువీది సురేందర్(30) తమ గ్రామానికి చెందిన వాడని తెలిసి చాట్రాయి మండలం చిత్తపూరు గ్రామస్తులు ఉలిక్కి పడ్డారు. సత్తుపల్లి బస్టాండ్‌లో సురేందర్ అనుమానాస్పదంగా కన్పించటంతో గుర్తించిన ఐడీ పార్టీ కానిస్టేబుల్ నరేశ్ పట్టుకునే ప్రయత్నం చేయగా, సురేందర్ బైక్‌పై పరార్ అయ్యాడు. కానిస్టేబుల్ నరేశ్ వెంటాడి అడ్డగించటంతో అతన్ని కత్తితో పొడిచి సురేందర్ పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ నరేశ్‌ని ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారిన సురేందర్ ఏ కొండూరు మండలం మాధవరంలో అమ్మమ్మ ఇంటి వద్ద పెరిగాడని, చిన్న వయస్సు నుంచే దొంగతనాలు చేస్తూ అనేక సార్లు పట్టుబడి జైలు శిక్ష అనుభవించాడని గ్రామస్తులు చెబుతున్నారు. జైలు నుంచి కొంత కాలం క్రితం బయటకు వచ్చిన సురేందర్ దొరక్కుండా సత్తుపల్లి, ఖమ్మం ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

దిగొచ్చిన ఇసుక



» ఆరు యూనిట్లు రూ.10వేలు » ధర తగ్గినా డిమాండ్ లేదు
» ర్యాంపులలో ఆగని దందా » బిల్లు లేకుండా లారీ ఇసుక రూ.5వేలు
» బిల్లు కావాలంటే అదనం » జిల్లాలో తగ్గిన భవన నిర్మాణాలు
» ప్రభుత్వ అభివృద్ధి పనులు అంతంత మాత్రమే

జిల్లాలో ఇసుక ధరలు అందుబాటులోకి వచ్చాయి. పాత పశ్చిమగోదావరి జిల్లాలోని ఆయా ప్రాంతాలను బట్టి ఆరు యూనిట్ల ఇసుక రూ.10వేల నుంచి 11వేలు ఉంది. అయితే ర్యాంపులలో అదనపు ధర వసూళ్లకు అడ్డు కట్ట వేస్తే ఇసుక ధర మరింత తగ్గే అవకాశం ఉంది. బిల్లు అడిగితే సంబంధిత ర్యాంపులో నిర్దేశిత ధర ఎంత ఉందో అంత తీసుకుని మరో రూ.5వేలు అదనంగా వసూలు చేస్తున్నారని లారీ యజమానులు చెబుతున్నారు.

పాలకొల్లు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వాస్తవానికి ఇసుక ర్యాంపులలో ఐదు యూనిట్లు ఎగుమతి చేస్తున్నప్పటికీ ఆయా లారీలలో ఆరు యూనిట్లు తరలిస్తున్నారు. ఇలా అదనంగా ఇసుక రావటం వినియోగదారులకు కొంత ఊరట కలిగిస్తున్నప్పటికీ ర్యాంపులలో అదనపు వసూళ్లు ఆగితే ఇసుక ధర కనిష్ఠ స్థాయికి వచ్చే అవకాశం ఉంది. ఇసుక ధరలు అందుబా టులోకి వచ్చినప్పటికీ నిర్మాణ రంగం నత్తన డకన నడుస్తున్నది. మార్కెట్‌లో ఆర్థిక మాం ద్యం తాండవిస్తుండటం, ప్రస్తుత ఆర్థిక సంవ త్సరం నాలుగో త్రైమాసికం చివర దశలో ఉండటంతో నిర్మాణ పనులు సన్నగిల్లాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అభివృద్ధి పను లు కొంత మేరకు మెరుగుపడవచ్చని నిపుణు లు అంచనా వేస్తున్నారు.

నిర్మాణ రంగం నత్తనడక

ప్రభుత్వ పరంగా సీసీరోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలిచి ఆమోదించినప్పటికీ జిల్లా వ్యాప్తంగా ఇంకా అధిక శాతం పనులు ప్రారంభించలేదు. జిల్లాలో వ్యక్తగత భవన నిర్మాణాలు, అపార్టుమెంట్ నిర్మాణాలు నాలుగింట రెండు వంతుల తగ్గాయి. ఈకారణంగా ఇసుక ధర అందుబాటులో ఉన్నప్పటికీ నిర్మాణం అంతంత మాత్రంగానే ఉంది. మరో వైపు విపణిలో నగదు కష్టాలు తగ్గడంతో భవన నిర్మాణ సామగ్రి ధరలు తగ్గినప్పటికీ అంతగా భవనాలు నిర్మించడానికి పౌరులు ఆసక్తి చూపించడం లేదు. జిల్లాలోని పలు పట్టణాల్లో ఇప్పటికే ఎన్టీఆర్ టిడ్కో గృహాలలో ఆక్యుపెన్సీ పెరిగింది. ఈకారణంగా పట్టణాలలోని మధ్యతరహా అద్దె ఇళ్లన్నీ ఖాళీ అవుతున్నాయి. గతంలో సంపన్నులు ఖాళీ జాగా ఉంటే భవనాలు నిర్మించి అద్దెకు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ సాహసం చేయడం లేదు. స్థిరాస్తులు కంటే బంగారంపై పెట్టుబడి పెడితే ఎప్పుడు కావాలంటే అప్పుడు బంగారాన్ని అమ్మి సొమ్ము చేసుకోవచ్చని అధిక శాతం మదుపరులు బంగారాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఈకారణంగానూ స్థిరాస్తులు క్రయవిక్రయాలు తగ్గుముఖం పట్టాయి. భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు వంటి పట్టణాలలో వేలసంఖ్యలో టిడ్కో ఇళ్లు జూన్ నాటికి లబ్ధిదారులకు అందజేయటానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. పూర్తి స్థాయిలో టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందచేస్తే ఆయా పట్టణాలలో వేల సంఖ్యలో అద్దె ఇళ్లు ఖాళీ అవుతాయి. ఇది దృష్టిలో పెట్టుకుని ఇళ్లు నిర్మించాలనే ఆలోచనను పలువురు విరమిస్తున్నారు. 120గజాలు స్థలంలో ఒక అంతస్తు ఇల్లు కట్టాలన్నా స్థలంతో పాటు కలుపుకుని రూ.40 లక్షల నుంచి 50లక్షలు ఖర్చు అవుతుంది. వచ్చే ఒకటి రెండేళ్లలో పట్టణాలలోని చిత్తడి ప్రాంతాల్లోని గృహాలు పట్టణాలకు దూరంగా ఉన్న మధ్య తరహా ఇళ్ల ధరలు ఘణనీయంగా తగ్గుతాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. దీంతో చిరుద్యోగులు చిరువ్యాపారులు తక్కువ ధరకు పాత ఇళ్ళే కొనుగోలు చేసి మరమ్మతులు చేయించుకుంటే తక్కువ బడ్జెట్‌లో సొంత ఇల్లు అమరుతుందనే ఆలోచనలో ఉన్నారు. ఇలా కొన్ని కారణాలుగా పాత పశ్చిమగోదావరి జిల్లాలో ఇసుకకు డిమాండ్ తగ్గింది. ధర అందుబాటులో ఉన్నప్పటికీ డిమాండ్ లేకపోవడంతో లారీ యజమానులు గగ్గోలు పెడుతున్నారు. ఒక వైపు ఇసుక ర్యాంపులలో అక్రమంగా అదనపు వసూళ్లతో కిరాయిలు కిట్టుబాటు కావడం లేదని లారీ యజమానులు చెబుతున్నారు. రోజుకి రెండు లారీలు ఇసుక రవాణా చేయగలిగితే డీజిల్, డ్రైవర్ ఇతర ఖర్చులు పోను రోజుకి రెండు వేలు మిగలటం గగనం అవుతుందని లారీ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ర్యాంపులలో అక్రమ వసూళ్ల ప్రభుత్వం దృష్టికి వెళ్లినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉచిత ఇసుక ఊతపదంగా మిగలకూడదని ప్రభుత్వం అక్రమ వసూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.



లారీ, ఎక్స్‌కవేటర్ సీజ్

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పట్టింపాలెంలోని ఎర్రకాలువలో ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్న ఎక్స్‌కవేటర్, లారీని ఎర్రకాలువ ఏఈ అనిల్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. వీటిని సీజ్ చేసి తాడేపల్లిగూడెం రూరల్ స్టేషన్‌కు తరలించారు. ఎర్రకాలువలో ఎలాంటి అక్రమ తవ్వకాలకు పాల్పడినా సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని ఏఈ అనిల్ హెచ్చరించారు.

కంకర కరకర

కంసాలిగుంటలో కాల్వ గట్టు తవ్వుతుండగా అడ్డుకున్న గ్రామస్థులు

ఉంగుటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలంలోని పోలవరం కాలువ గట్టు వెంబడి కంసాలిగుంట వద్ద అనుమతులు లేకుండా సోమవారం రాత్రి కంకర తవ్వుతుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. వీరు రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసులకు సమాచారం అందించడంతో పోలవరం కెనాల్ ఏ.ఈ.బాపూజి ఆధ్వర్యంలో సిబ్బంది చేబ్రోలు పోలీసు స్టేషన్‌కు సంబంధిత లారీలను స్వాధీనం చేసుకుని తరలించారు. వీటిపై విచారణ నిర్వహిస్తున్నారు. అయితే గ్రావెల్ లోడు చేస్తున్న మిషన్‌ను ఆ ప్రాంతానికి దూరంగా ఉంచి పలుకుబడి గల నాయకులు కథ నడిపించారని ఆరోపిస్తున్నారు. కొంత కాలంగా అధికారుల కళ్లుగప్పి ఇక్కడ కంకరను తవ్వుతున్నా నిమ్మకు నీరెత్తుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి.

ప్రేమ విఫలమై ప్రైవేట్ ఉద్యోగి ఆత్మహత్య



మియాపూర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలం అవడంతో అనారోగ్యానికిగురై ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమగోదావరి జిల్లా పోడూరుకు చెందిన రోహిత్‌కుమార్ మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్‌పేటలో తన స్నేహితులైన సిద్ధు, పవన్‌తో కలిసి గది అద్దెకు తీసుకుని నివాసం ఉంటు తోసిబా కంపెనీలో పనిచేస్తున్నాడు. అనారోగ్య కారణాలతో ఉద్యోగానికి వెళ్లకుండా గదిలోనే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం స్నేహితులకు ఫోన్ చేసి ట్యాబులెట్స్ వేసుకుని పడుకున్నానని చెప్పాడు. వారు విధులు ముగించుకుని ఇంటికి వచ్చిచూడగా తలుపు తియ్యక పోవడంతో బలవంతంగా తలుపులు తీసి చూడగా అప్పటికే ఉరివేసుకుని మృతిచెందాడు. దీంతో వారు 100డయల్ చెయ్యడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

పెనుగొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పెనుగొండ మండలంలోని ఒక గ్రామంలో ఆదివారం నేరేడుమిల్లి రాంబాబు అనే వ్యక్తి ఒక దివ్యాంగురాలిపై ఎవరూ లేని సమయంలో ఇంటిలోకి వెళ్ళి అత్యాచారం చేసినట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. కేసు నమోదు చేసి మంగళవారం నిందితుడిని అరెస్టు చేసినట్టు తెలిపారు.

మహిళపై దాడి

ఏలూరు క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : చీరలు అమ్మే ఒక మహిళ చీరలను అప్పుకు విక్రయించి సొమ్ము కట్టాలని కోరడంతో ఇద్దరు మహిళలు ఆ మహిళపై దాడి చేయడంతో బాధితురాలు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేశారు. ఏలూరు పోణంగి రోడ్డు చిరంజీవి బస్‌స్టాప్ ప్రాంతానికి చెందిన చాగంటి రాణి చీరల వ్యాపారం చేస్తూ ఉంటుంది. అదే ప్రాంతానికి చెందిన సాయిల శివ లక్ష్మికి 10 వేల రూపాయల విలువైన చీరలను అప్పుగా విక్రయించింది. ఆ సొమ్ము కట్టాలని పలు మార్లు అడుగుతున్నప్పటికీ ఆమె దాట వేసింది. ఈనెల 9వ తేదీ ఉదయం చాగంటి రాణి వెళ్ళి శివలక్ష్మిని సొమ్ములకోసం అడగడంతో శివలక్ష్మి, ఆమె పెద్దమ్మ అయిన నాగమిల్లి వెంకట లక్ష్మిలు కలిసి రాణిపై దాడి చేశారు. రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ ఎస్ఐ సిహెచ్‌కె దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సౌండ్ సిస్టమ్ సామగ్రి చోరీ

ఏలూరు క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఒక చర్చిలోని సౌండ్ సిస్టమ్‌కు సంబంధించిన వస్తువులు చోరీకి గురయ్యాయని పాస్టర్ ఫిర్యాదు చేయడంతో ఏలూరు రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఏలూరు కండ్రికగూడెం ప్రాంతానికి చెందిన అబ్బాల శ్రీనివాసరావు అదే ప్రాంతంలో ఒక చర్చికి పాస్టర్‌గా పని చేస్తున్నారు. ఫిబ్రవరి 5వ తేదీన ఉదయం 10 గంటలకు చర్చికి వెళ్ళేటప్పటికి చర్చిలో ఉండాల్సిన మైక్‌లు పలు ఎలక్ట్రికల్ వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సీహెచ్‌కె దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెలగలేరులో పట్టపగలు చోరీ

16 కాసుల బంగారం అపహరణ

పెనుమంట్ర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వెలగలేరు మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న మామిడిశెట్టి ప్రసాద్ ఇంటిలో సోమవారం మధ్యాహ్నం ఇంటిలో దొంగల పడి 16 కాసుల బంగారం, వెండి వస్తువులు దోచుకెళ్లినట్టు బాధితుడు పెనుమంట్ర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన క్లూస్ టీం వేలిముద్రలను సేకరించారు. బాధితుడి కథనం ప్రకారం భార్య భర్తలు ఉదయాన్నే వ్యవసాయ పనికి వెళ్ళామని చెప్పారు. భార్య తిరిగి 5 గంటలకు వచ్చి చూసే సరికి ఇంటిలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. 16 కాసుల బంగారం అపహరణకు గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

మారుజాతి కలపతో లారీలు పట్టివేత



కొయ్యలగూడెం, మార్చి11 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలివస్తున్న మారుజాతి కలప లారీలను పట్టుకున్నట్లు కన్నాపురం రేంజ్ సెక్షన్ అధికారి బీ.దినేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మంగళవారం తెల్లవారుజామున మండలంలోని యర్రంపేట, కొయ్యలగూడెం ప్రాంతాలకు మూడు లారీల్లో మారుజాతి పుల్ల తరలి వస్తుందని తమకు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్ళి మూడు లారీలను పట్టు కున్నామని అన్నారు. ఈ కలప పేరుపాలెం గ్రామం నుంచి వస్తుందని తెలిపారు. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం: కాపాడిన పోలీసులు

ఏలూరు క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : భార్యా భర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఒక యువతి ఆత్మహత్య చేసుకోవడానికి రైలు పట్టాలపై ఉండగా ప్రయాణికులు గుర్తించి రైల్వే ఎస్ఐ పి.సైమన్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన ఆధ్వర్యంలో మహిళా కానిస్టేబుళ్ళు, పోలీసులు వెళ్ళి ఆమెను తీసుకొచ్చి కౌన్సెలింగ్ నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఏలూరు వెంకటాపురం పంచాయతీ శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన నాదెళ్ళ జమున తన భర్తతో మనస్పర్థలు ఏర్పడడంతో గొడవపడిన ఆమె ఆత్మహత్య చేసుకోవాలని భావించి ఏలూరు గూడ్స్‌షెడ్డు రోడ్డులోని రైలు పట్టాల వద్దకు వచ్చి పట్టాలపై నిలబడి ఉంది. ప్లాట్‌ఫారమ్‌పై ఉన్న ప్రయాణికులు ఆమెను గమనించి వెంటనే రైల్వే ఎస్ఐ పి సైమన్‌కు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు ఆమెను సంరక్షించి కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగించారు.

కత్తితో మామపై అల్లుడి దాడి

కాళ్ళ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : భార్యను తనతో కాపురానికి పంపడం లేదని పిల్లనిచ్చిన మామయ్య పై అల్లుడు కత్తితో దాడి చేశాడు. కాళ్ళ ఎస్సై ఎన్.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం వేంపాడు గ్రామానికి చెందిన యు.సత్యనారాయణపై అతని రెండవ అల్లుడు అత్తిలి మండలం కె.ఎస్.గట్టు గ్రామానికి చెందిన కోనా కిషోర్ తన భార్యని కాపురానికి పంపమని సోమవారం వేంపాడు గ్రామానికి వచ్చి గొడవ పడ్డాడు. ఈ ఘర్షణలో తనతో తెచ్చుకున్న కత్తితో మామయ్యపై దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సత్యనారాయణను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో కిషోర్ పై కేసు నమోదు చేశారు.

రేషన్ సరుకుల స్టాక్‌లో వ్యత్యాసం

యలమంచిలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కొంతేరు గ్రామంలో రేషన్ సరుకులు పంపిణీచేసే ఎండియూ వాహనాన్ని తహసీల్దారు జి.పవన్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. వాహనంలో బియ్యం, పంచదార స్టాక్‌లలో వ్యత్యాసాలను గుర్తించి ఎండియూ-12 ఆపరేటర్ నేతల సురేంద్రమూర్తిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దారు తెలిపారు.

వలస కార్మికుల నివాస ప్రాంతాలు పరిశీలన

పోలవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టులో ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన వలస కార్మికుల బస ప్రాంతాలను డీఎస్పీ ఎం వెంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కార్మికుల ఏజన్సీ ప్రతినిధులతో మాట్లాడుతూ వేసవి దృష్ట్యా వారికి తాగునీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారికి వైద్యం, ఇతర మౌలిక వసతులు కల్పించే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ బాల సురేష్‌బాబు, ఎస్ఐ పవన్ కుమార్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

భీమవరం క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలు ఆసుపత్రి పని నిమిత్తం భీమవరం పట్టణానికి వచ్చి తిరిగి వెళ్తుండగా లారీ ఢీకొంది. వన్‌టౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పాలపర్తి సుందరరావు పాలకొల్లు విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసి రిటైర్ అయ్యారు. అయితే ఈ నెల 10వ తేదీన భార్య పాలపర్తి గ్లోరి మహితాకుమారి (62) ఇద్దరూ కలసి ద్విచక్ర వాహనంపై భీమవరం ఆసుపత్రికి వచ్చారు. రాత్రి 9 గంటల సమయంలో ఇంటికి తిరిగి వెళ్తుండగా విస్సాకోడేరు వంతెన సమీపానికి వెళ్ళేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ వారి వాహనాన్ని ఢీకొంది. దీంతో ఇద్దరూ కింద పడిపోయారు. మహితా కుమారిని లారీ కొంత దూరం లాక్కెళ్ళిపోయింది. అక్కడున్న స్థానికులు హుటాహుటిన ఆమెను భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొంతసేపటికి మృతి చెందినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. మృతురాలి కుమారుడు విజయ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొమడవోలులో చోరీ

ఏలూరు క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి తాళం వేసి కొబ్బరికాయల వ్యాపారం చేయడానికి వెళ్ళి మధ్యాహ్నం భోజనానికి వచ్చేటప్పటికి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బంగారపు వస్తువులు, నగదు అపహరించుకుపోయారు. ఏలూరు రూరల్ మండలం కొమడవోలు గ్రామానికి చెందిన గుజ్జుల రాంబాబు (62) కొబ్బరికాయల వ్యాపారం చేస్తూ ఉంటాడు. ఫిబ్రవరి 11వ తేదీ ఉదయం 6 గంటలకు కొబ్బరిబొండాల వ్యాపారానికి వెళ్ళి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చాడు. వచ్చేటప్పటికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని కాసున్నర ఉంగరాలు, ఐదు వేల రూపాయల నగదు అపహరణకు గురైంది. ఈసంఘటనపై సోమవారం రాత్రి ఫిర్యాదు చేయడంతో ఏలూరు రూరల్ ఎస్ఐ సీహెచ్‌కె దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15 నుంచి మండల స్థాయి శిక్షణ తరగతులు

బుట్టాయగూడెం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఎన్నికైన ప్రజాప్రతినిధులు, నూతనంగా ఎన్నికైన పీసా గ్రామసభ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల లీడర్లు, సచివాలయం సిబ్బంది, మండల స్థాయి అధికారులకు ఈ నెల 15 నుంచి 26 వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. పీసా చట్టం, పీసా నియామకాలు, పీసా గ్రామసభలపై అవగాహన కల్పిస్తామని ఎంపీడీవో కె.జ్యోతి తెలిపారు. రెండు షిఫ్టులవారీగా శిక్షణ ఉంటుందన్నారు.

అపరాలను మద్దతు ధరకే కొనుగోలు చేస్తాం

ఏలూరు రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు పండించిన మినుములు, పెసలు, ఏలూరు మార్కుఫెడ్ ద్వారా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయనున్నట్లు మార్కెట్ జిల్లా మేనేజర్ గుప్తా తెలిపారు. మంగళవారం ఏలూరు రూరల్ మండలం జాలిపూడిలో పెసలు, మినుము కొనుగోలుపై అవగాహన కల్పించారు. పెసలు క్వింటా రూ.8,682, మినుములు క్వింటా రూ.6950 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భారీ వాహనాల రాకపోకలపై నగరంలో ఆంక్షలు

ఏలూరు క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలో భారీ వాహనాల రాకపోకలపై పోలీస్ అధికారులు చర్యలు చేపట్టారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో గత నెల 24వ తేదీన పట్టుకోండి చూద్దాం అనే శీర్షికన కథనం ప్రచురించిన నేపథ్యంలో ఎస్పీ కెపిఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మణ రావు వారి సిబ్బంది కలిసి నగరంలోకి వచ్చే అన్ని మార్గాల్లో ప్రతి రోజు భారీ వాహనాలు రాకుండా ట్రాఫిక్ కానిస్టేబుళ్లను నియమించారు. నెంబర్ లేకుండా నగరంలో తిరుగుతున్న ఆరు టిప్పర్లను మంగళవారం అదుపులోకి తీసుకుని నెంబర్లు బిగించిన తరువాత విడిచిపెట్టారు. ట్రాఫిక్ పోలీసులు అడుగడుగునా నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణా చర్యలు చేపట్టడంతో ప్రస్తుతం ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడంతో ప్రజలు ట్రాఫిక్ పోలీసులకు కృతజ్ఞతలు చెప్తున్నారు.

మౌలిక సదుపాయాలకు నిధులివ్వండి : ఎంపీ

ఏలూరు టూటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి నూజివీడు ఐఐఐటీలో మౌలిక వసతుల కల్పనకు రూ.15.26 కోట్లు సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి మోహన్‌లాల్‌కు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని కేంద్రమంత్రి కార్యాలయంలో మంగళవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంపీ మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి అత్యవసర వైద్యపరికరాలు కోసం రూ.3.09 కోట్లు మంజూరు చేయాలన్నారు. ప్రయోగశాలల్లో పరికరాల కొనుగోలుకు ఈ నిధులు అవసరమని వివరించారు. తన విజ్ఞప్తికి కేంద్ర మంత్రి మోహన్‌లాల్ సానుకూలంగా స్పందించారని ఎంపీ తెలిపారు.

ఘనంగా కురెళ్ల చంద్రావతి వందవ పుట్టిన రోజు వేడుక

భీమడోలు, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : కురెళ్లగూడెం గ్రామానికి చెందిన కురెళ్ల చంద్రావతి వందవ పుట్టిన రోజు వేడుకలు కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. దివంగత కురెళ్ల శేషగిరిరావు సతీమణి చంద్రావతి వందవ పుట్టిన రోజును ఐదు తరాలకు చెందిన వ్యక్తుల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పేద వృద్ధులకు పండ్లు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఇదే కుటుంబానికి చెందిన కార్డియాలజీ వైద్యురాలు హేమాఎల్ పంద్రంగి అమెరికాలో ఉన్నత స్థానంలో ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన మొదటి 10 మంది కార్డియాలజీ వైద్యుల్లో హేమాఎల్ ఒకరు.

హెచ్ఎం తీరుపై గిరిజన సంఘాల ఆందోళన

బుట్టాయగూడెం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తోటి ఉద్యోగులను మానసికంగా వేధిస్తున్న హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం, ఆదివాసీ గిరిజన జ్యోతి జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి. కమిటీ జిల్లా నాయకులు తెల్లం రామకృష్ణ, కూరం సత్యన్నారాయణ దొర మాట్లాడుతూ కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో పనిచేస్తున్న హెచ్ఎం తీరుపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని కోరారు. ఐటీడీఏ అధికారి హెచ్ఎంను కాపాడేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారని, సంబంధిత అధికారి తన వైఖరిని మార్చుకోకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అనూష, నాగమణి, వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

'విద్యార్థుల కోసం జగన్ పోరాడటం హాస్యాస్పదం'

ఏలూరుటూటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న మాజీ సీఎం జగన్ ఇప్పుడు యువతపోరు పేరుతో విద్యార్థులకు న్యాయం చేయమని పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందని తెలుగు యువత అధ్యక్షుడు మహేష్ యాదవ్ పేర్కొన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యా దీవెన, వసతిదీవెన బకాయిలు చెల్లించకుండా జగన్ మోసం చేశాడని అన్నారు. వైసీపీ ఐదేళ్ల హయంలో ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించలేదన్నారు. విద్యార్థులు, యువత వైసీపీ స్వార్థరాజకీయాలకు బలికావద్దన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మారం సూర్య, డీఎస్‌కే నాయుడు, పీ.వింద్యా, లావణ్య, ఎం.రాకేష్, వీ.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో సంపూర్ణ ఆరోగ్యం

పెదవేగి, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : ఫిజియోథెరపీతో ఆరోగ్యం చేకూరుతుందని పెదవేగి ఎంపీడీవో పి.శ్రీనివాస్ అన్నారు. పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు మంగళవారం ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిజియోథెరపీ విభాగం తరఫున శిబిరాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. దీంతోపాటు మండలానికో రెండు కిట్లను ఉచితంగా అందిస్తున్నారని, ఈ కిట్లను ఆయా గ్రామ పంచాయతీలకు తీసుకెళ్ళి, ప్రజలకు ఫిజియోథెరపీ చేయించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు కృష్ణంరాజు, సాయికృష్ణ, ప్రసాద్, నిర్మల, సౌజన్య పాల్గొన్నారు.

కలపర్రు, వట్లూరులో శానిటేషన్ పరిశీలన

ఏలూరుసిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనూరాధ జిల్లాలోని వట్లూరు, కలపర్రు గ్రామాల్లో చెత్త సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఇంటింటికీ వెళ్ళి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. పెదపాడు మండలం కలపర్రులోని మండల ప్రాథమిక పాఠశాలలోనూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో అవగాహన కలిగితే గ్రామాలు శుభ్రంగా ఉంటాయని ఆమె పేర్కొన్నారు. ఈ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీలు సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ పర్యటనలో పెదపాడు ఈఓఆర్డి సూర్యకుమారి, కలపర్రు, వట్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శులు శివయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు. శానిటేషన్ డ్రైవ్ విషయమై డీపీవో కార్యాలయం నుంచి ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీంతో పాటు జిల్లాలో ఇంటి పన్నులు, ఇతర పన్నుల సేకరణ వేగవంతం చేయాలని ఆమె కోరారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ఫొటోలు అప్‌లోడ్ చేయాలని కోరారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో జిల్లాలోని డిఎల్‌పిఓలు, ఈఓఆర్‌డిలు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి రుణ పరిమితి పెంపు



ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బందికి ఆర్థిక భరోసా కల్పించడమే తమ లక్ష్యమని ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ రుణపరిమితి మూడు నుంచి ఐదు లక్షల వరకూ పెంచుతున్నట్టు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు జిల్లా పోలీస్ కార్యాలయానికి వెళ్ళి జిల్లా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు ఉద్యోగులకు వారి అవసరాల నిమిత్తం ఇప్పటి వరకూ ఏలూరు జిల్లా పోలీస్ కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా మూడు లక్షల వరకు రుణాన్ని ఇచ్చేవారు. ఇకపై ఐదు లక్షలు ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఎఆర్‌డీ ఎస్పీ బి.చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఆర్ఐ పవన్ కుమార్, పోలీస్ కో ఆపరేటివ్ సెక్రటరీ శ్రీనివాసరావు, శానం రమేష్ బాబు, శ్రీరామ్ పలువురు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన క్లబ్ కార్యవర్గం నాయకులు

వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నడకను ప్రోత్సహించడమే వాకర్స్ క్లబ్ లక్ష్యమని విశాఖపట్నం ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ జిల్లా శాఖ అధ్యక్షుడు జి.రామరాజు పేర్కొన్నారు. ఏలూరు శుభోదయం పార్కు వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం మంగళవారం పార్కు ఆవరణలో జరిగింది. నగరంలోని 12 వాకర్స్ క్లబ్‌ల నాయకులు, ప్రతినిధులు ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ 1986లో విశాఖ బీచ్‌లో తెలుగు వ్యక్తి స్థాపించిన ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ ప్రస్తుతం దేశవిదేశాల్లో విస్తరించినట్టు తెలిపారు. క్లబ్ ప్రెసిడెంట్ ఐ.ఎం.ఆర్. మోహన్‌రావు, ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు డాక్టర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

కాలనీ ఇళ్ల స్థలాల ఆక్రమణ..

గ్రామస్తుల ఫిర్యాదుతో అధికారుల సర్వే



కాలనీ భూమిలో సాగవుతున్న పశుగ్రాసం

పెదవేగి, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలం కొప్పులవారిగూడెంలో వైసీపీ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ భూమి విస్తీర్ణంలో తేడాలున్నాయని గ్రామస్తులిచ్చిన ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. కొప్పులవారిగూడెంలో మూడెకరాల విస్తీర్ణంలో జగనన్న కాలనీ ఏర్పాటు చేయగా అనువుగా లేకపోవడంతో ఇళ్లు నిర్మించుకోలేదు.. ఇప్పుడు ఆ లేఅవుట్ ముళ్ల కంపలతో పాములకు ఆవాసంగా మారింది. ఈ క్రమంలో అదికాస్తా కొంతమేర ఆక్రమణలకు గురైంది. అందులో పశుగ్రాసం పెంచుతుండగా, మరోవైపు రైతులు మొక్కజొన్న కల్లాలకు వినియోగిస్తున్నారు. గ్రామస్తుల ఫిర్యాదుతో మంగళవారం ఉదయం రెవెన్యూ, సర్వే, పంచాయతీ సంయుక్తంగా కాలనీ భూమి సర్వే చేపట్టారు. మూడెకరాల భూమిని అదే గ్రామానికి చెందిన మాదల సుబ్బారావు అనే రైతు ఇళ్ల స్థలాల కోసం ఇచ్చారు. అందులో కొంతమేర ఆ రైతు ఆక్రమణలో ఉందని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సర్వే నిర్వహించగా అందులో 41 టేకు చెట్లు, 15 కొబ్బరి, వక్క చెట్లు రైతు ఆక్రమణలో ఉన్నట్లుగా గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆ భూమిలో సర్వే చేపట్టామని పెదవేగి తహసీల్దారు ఎస్.బ్రమరాంబ తెలిపారు. కాలనీ కోసం పంచాయతీ ఏర్పాటు చేసిన పైపులైన్‌ను రైతు తన అవసరాలకోసం ఉపయోగిస్తున్నట్లుగా గుర్తించి తొలగించినట్టు తెలిపారు. దీనిపై మరింత క్షుణ్ణంగా పరిశీలించి, పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తహసీల్దారు బ్రమరాంబ వివరించారు. మండల సర్వేయర్ సత్యనారాయణ మూర్తి, ఆర్ఐ కేవీ.సారథి, గ్రామ వీఆర్వో సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.



ఆక్రమణలపై సర్వే చేస్తున్న సిబ్బంది

ఏపీసీఎన్ఎఫ్ ద్వారా ప్రకృతి వ్యవసాయానికి ఏకీకృత వ్యూహం

ఏలూరుసిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) ప్రోగ్రాం కింద 2025 వార్షిక ప్రణాళికపై చర్చించటానికి జిల్లా స్థాయిలో ఉన్నత స్థాయి సమన్వయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఇది ప్రకృతి వ్యవసాయం, గ్రామీణ మార్పు కోసం ఒక ముఖ్యమైన అడుగు ఈ సమావేశంలో వివిధ శాఖల ముఖ్య అధికారులతో కలిపి జిల్లాలో ప్రగతిశీల విధానం అమలుకు సంబంధించి అంతర్గత సహకారాన్ని పటిష్ట పరచడంపై దృష్టి సారించారు. ఈ సమావేశం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆధ్వర్యంలో జరిగిందని ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తెలిపారు. 2025 కోసం వ్యూహాత్మక రోడ్ మాప్‌లో భాగంగా జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్, రైతు ఉత్పత్తి సంస్థలు, శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం, సేంద్రియ సాగును ప్రోత్సహించే కార్యక్రమాలపై చర్చించారు.

పాఠశాలకు సోలార్ సిస్టం వితరణ

జీలుగుమిల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వంకవారిగూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రంలోని విద్యా విధానాన్ని కాశీపట్నపు ఫౌండేషన్ నిర్వాహకులు ఐ.వి.సుబ్బారావు కొనియాడారు. పాఠశాలకు కాశీపట్నపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.6 లక్షల విలువ చేసే సోలార్ సిస్టంను అందజేశారు. పాఠశాల ఏవో టి.ఎస్.రవికుమార్, భారతీయ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



● మాజీ ఎంపీ మురళీమోహన్ స్వగ్రామం ఏలూరు రూరల్ మండలంలోని చాటపర్రు వచ్చిన నేపథ్యంలో ఆయనను మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన తన చిన్ననాటి జ్ఞాపకాలను వారితో పంచుకున్నారు.

ఆర్థిక వ్యూహాలపై అవగాహన

ఏలూరు అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : ఆర్థిక అక్షరాస్యత - పెట్టుబడిదారుల విద్య అనే అంశంపై మంగళవారం ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల విద్యార్థినులకు ఒకరోజు వర్కుషాపు జరిగింది. గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్జాతీయ వ్యాపార అధ్యయనాల డైరెక్టర్ డాక్టర్ జాకీర్ హుస్సేన్ ఆర్థిక ప్రగతి నైపుణ్యాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

చింతలపూడి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దని, అలా చేస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు హెచ్చరించారు. ట్రాఫిక్ రూల్స్ తెలుసుకుని డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనం నడపాలని అన్నారు. అదేవిధంగా ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, ట్రాక్టర్ డ్రైవర్లు లౌడు స్పీకర్లు పెట్టి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని అన్నారు.

సోము వీర్రాజును కలిసిన నాయకులు

లింగపాలెం, మార్చి 11(ఆంధ్రజ్యోతి) :బీజేపీ నాయకుడు సోము వీర్రాజును రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు రాయంకుల చక్రధరరావు, పలువురు లింగపాలెం మండల బీజేపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన నాయకులు ఉన్నారు.

పోలీసులను ఆశ్రయించిన యువతి

ఏలూరు క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : స్నాప్ చాట్‌లో పరిచయమైన ఒక యువకుడు ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రాంతానికి చెందిన యువతి(20)కి స్నాప్ చాట్‌లో రాజమహేంద్రవరానికి చెందిన కారు డ్రైవర్ శివగిరి సందీప్ పరిచయమయ్యాడు. ప్రేమ పేరుతో ఏలూరు వచ్చి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి శారీరక సంబంధాన్ని పెట్టుకుని ఇప్పుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని బాధితురాలు ఏలూరు రూరల్ పోలీసులకు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేసింది. దీంతో శివగిరి సందీప్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

పరీక్షా పరికరాల అందజేత

పెదవేగి, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు యూటీఎఫ్ పెదవేగి మండల శాఖ పరీక్షా పరికరాలు అందించింది. పెదవేగిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్, రెండు పెన్నులు, పెన్సిల్, స్కేలు, వృత్తలేఖిని, హాల్ టికెట్ పెట్టుకోవడానికి అనువుగా పౌచ్‌ను అందించారు. పెదవేగి ఎంఈవోలు సబ్బితి నరసింహమూర్తి, వి.అరుణ్‌కుమార్, గ్రామసర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి, టీడీపీ జిల్లా కార్యదర్శి తాతా సత్యనారాయణ, యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పరసా నాగార్జున, టి.ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు షఫీ, భూషణం, గుప్తా, రమేష్ పాల్గొన్నారు.

రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేత

ఏలూరు అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ క్షయవ్యాధి నివారణ విభాగంలో హెల్త్‌విజిటర్ ఉద్యోగ విధులు నిర్వర్తిస్తూ ఆకస్మికంగా మృతి చెందిన బండి రత్నకుమార్ కుటుంబ సభ్యులకు జాతీయ ఆరోగ్య పథకం ద్వారా రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియాను మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని, డీఐవో డాక్టర్ నాగేశ్వరరావు అందజేశారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ విధుల నిర్వహణలో రత్నకుమార్ నిబద్ధతతో పనిచేశారని, జిల్లాలో క్షయ నియంత్రణలో వైద్యసిబ్బందిని సమన్వయపరచుకుని సత్ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. జిల్లా మలేరియా అధికారి ప్రసాద్, మృతుని భార్య మేరీ క్రిస్టియానా పాల్గొన్నారు.

డీఎల్ఎస్ఏ సేవలు చేరువ చేయాలి

ఏలూరు క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : న్యాయ సేవ అధికార సంస్థ అందించే సేవలను ప్రజలకు చేరువ చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఏలూరు జిల్లా ఆవరణలో ఉన్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో స్వచ్ఛంధ సేవా సంస్థల సంఘ నాయకులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు.




ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంటి

ప్రజల నుంచి అర్జీల స్వీకరణ

ఏలూరు టూటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సూపర్ - 6 పథకాలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. రానున్నరోజుల్లో మరిన్ని ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేపడతామన్నారు. అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనులు చేస్తుందన్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్‌పై జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ సమీక్ష

ఏలూరుసిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన సోమవారం ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ రాబోయే వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణను సిద్ధ చేయాలని అధికారులను ఆదేశించారు. జలజీవన్ మిషన్ కింద పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని , అలాగే జడ్పీ నిదులు ద్వారా మంజూరైన పెండింగ్ పనులపై పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ డిప్యూటీ సిఈఓ కె.భీమేశ్వర్, ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారులు, ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న జడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీ


రామచంద్రాపురంలో ఆలయ పునర్నిర్మాణం





నూతనంగా ఎన్నికైన గౌరవాధ్యక్షులు కిశోర్, సత్తిపండు

జంగారెడ్డిగూడెం,(ఏలూరు)మార్చి 11(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలోని రామచంద్రాపురంలో 65 ఏళ్ల చరిత్ర కలిగిన కోదండ రామాలయాన్ని రూ.60 లక్షలతో పునర్నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో 15 నుంచి 17వ తేదీ వరకు మూడ్రోజుల పాటు కోదండ రామాలయ విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆలయ పునఃప్రతిష్ఠ పనుల్లో పదిహేను మందిని కమిటీగా ఏర్పాటు చేసి ఆలయ పనులు చేపట్టారు. కొండ్రెడ్డి కృష్ణ కిశోర్, పరిమి సత్తిపండును గౌరవాధ్యక్షులుగా ఎన్నుకున్నట్టు కమిటీ తెలిపింది. ఈ మేరకు అన్ని పనులు పూర్తి చేసినట్టు గౌరవాధ్యక్షులు తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణ పరిసర ప్రాంత ప్రజలు ఈ వేడుకను విజయవంతం చేయాలని నారాయణరావు కోరారు.



నూతన ఆలయం, ప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న విగ్రహాలు

గోపన్నపాలెం హైస్కూల్ తనిఖీ

దెందులూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీరు, నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు డాక్టర్ విజయకృష్ణ అన్నారు. మంగళవారం దెందులూరు మండలం గోపన్నపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి హెచ్ఎంకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనంలో కొన్ని లోపాలున్నాయని వాటిని సరి చేయాలని అన్నారు. అనంతరం హైస్కూల్లో పాఠశాల రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నిర్వాకులు వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ పౌష్టికాహారం అందించి మంచి పేరు తెచ్చుకోవాలని విజిలెన్స్ సభ్యుడు విజయకృష్ణ తెలిపారు.

ఆధ్యాత్మికం

గంగానమ్మ జాతర ప్రారంభం

ఏలూరు కార్పొరేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వత్తేబాదలో మూడ్రోజుల పాటు జరగనున్న గ్రామదేవత గంగానమ్మ అమ్మ జాతర మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అఖండ దీపారాధన, అమ్మవారికి స్నానోత్సవం నిర్వహించారు. అమ్మవారి పుట్టింటివారైన రెడ్డివారు, అత్తింటి వారైన కూర్మావారు, భక్తులు సహస్ర నామార్చన నిర్వహించి అమ్మవారి ప్రతిమతో మేళతాళాలతో పసుపు, కుంకుమలతో ఊరేగింపు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని పొంగలి నివేదనలు సమర్పించి పానకం, వడపప్పుతో ప్రసాద పంపిణీ జరిపారు. ఈనెల 13వ తేదీన అమ్మవారి ప్రతిమతో భారీ ఊరేగింపు జరుపుతామని చెప్పారు.

తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఏలూరు కార్పొరేషన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : అగ్రహారంలో జనార్దన స్వామి, రంగనాయక స్వామివార్ల తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు వంగల పవన కుమారాచార్యులు, కందాదై వెంకటాచార్యులు భక్తులతో పూజలు నిర్వహించారు. మొదటి రోజు మంగళవారం స్వామివారిని, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. 12న కళ్యాణ మహోత్సవం, 13న రథోత్సవం, 15న పవళింపు సేవ నిర్వహించనున్నట్టు ఈవో నాగబాబు తెలిపారు.

నేటి నుంచి దుర్గమ్మ తిరునాళ్లు

కామవరపుకోట, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : కామవరపుకోట మండలం రావికంపాడు పంచాయతీలోని వెంకటాపురం గ్రామంలో కనకదుర్గమ్మ ఆలయ 74వ వార్షికోత్సవాలు ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త కోటగిరి కాశీ విశ్వనాథరావు తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో విశేష పూజలు, కుంకుమార్చనలు, హోమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కమిటీ తెలిపింది.

శనీశ్వరాలయంలో విశేష పూజలు

కామవరపుకోట, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : ఆడమిల్లిలోని శనీశ్వరాలయం వద్ద ఆలయ పంచమ వార్షికోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. అయ్యప్ప స్వామికి అభిషేకం నిర్వహించి స్వామివారికి, అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తాతా సర్వేశ్వరరావు దంపతులు అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈ మేరకు ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

ఉంగుటూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కైకరంలోని వల్లీదేవ సేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. అలాగే కైకరంలో కొలువైన సింగాలమ్మ ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు.

మద్ది క్షేత్రంలో ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం,(ఏలూరు) మార్చి 11(ఆంధ్రజ్యోతి) : గురువాయిగూడెంలో ఉన్న శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో స్వామికి ఆలయ అర్చకులు వేకువ జాము నుంచి ప్రభాత సేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామికి తమలపాకులతో విశేష పూజలు నిర్వహించారు.

ఘనంగా అమ్మవారి ఊరేగింపు

జీలుగుమిల్లి, మార్చి, 11: (ఆంధ్రజ్యోతి) : జగదాంబ అమ్మవారి 68వ వార్షికోత్సవం ఆలయ కమిటీ ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆరో రోజు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలు మేళ తాళాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిర్రి వెంకటేశ్వరరావు సభ్యులు గద్దె సుబ్రహ్మణ్యం, కొత్తపల్లి శ్రీను, బొలగాని అఖిల్, కోలా మధు, ఉలవల శివ, ఎన్.లక్ష్మీపతి, వారా శ్రీను, తదితరులు ఉన్నారు.

చెత్త సేకరణపై అవగాహన

బుట్టాయగూడెం, మార్చి11(ఆంధ్రజ్యోతి) : చెత్త నుంచి సంపదను సృష్టించి పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం కావాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఎండీ రజావుల్లా తెలిపారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం అధికారుల ఆదేశాల మేరకు దొరమామిడి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం రాముడు, ఇన్‌చార్జీ ఈవోపీఆర్డీ నిఖిల్ శర్మ, కార్యదర్శి జెకిరణ్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షలపై అవగాహన

జంగారెడ్డిగూడెం,(ఏలూరు) మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అలాగే హైదరాబాదుకు చెందిన ఏకేఎస్ ఐఏఎస్ అకాడమీ ఫ్యాకల్టీ నాగరాజు, గౌతమ్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

సారా కేసుల్లో అరెస్టులు

బుట్టాయగూడెం, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతరాజానగరంలో ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడిలో ఓ మహిళ పట్టుబడింది. ఐదు లీటర్ల కలిగి ఉండటంతో అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.వీరబ్రహ్మం తెలిపారు. సారాను సరఫరా చేసిన ముద్దప్పగూడేనికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. సారా కేసులో పరారీలో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని, పరింపూడి, డిప్పకాయలపాడుకు చెందిన ఇద్దరు మహిళలను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. దాడుల్లో సీఐ ఫణికుమార్, ఎస్సై సునీల్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ సాగు చేపట్టండి

బుట్టాయగూడెం, మార్చి11(ఆంధ్రజ్యోతి) : వర్జీనియా పొగాకు రైతులు సేంద్రియ సాగు చేపట్టి నాణ్యమైన దిగుబడులు సాధించాలని జంగారెడ్డిగూడెం వేలం అధికారి బి.శ్రీహరి తెలిపారు. మంగళవారం బుట్టాయగూడెంలో పర్యటించి బ్యాక్టీరియా వాడకంపై క్షేత్ర స్థాయిలో సదస్సును నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేసిన గద్దె శ్రీధర్‌కు 10 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆదర్శ నాగేంద్ర, కరాటం వెంకటరెడ్డి నాయుడు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలపై వినతి

కుక్కునూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని మంత్రి నిమ్మల రామానాయుడిని కుక్కునూరు టీడీపీ నాయకులు కలిశారు. అన్ని అర్హతలుండి కొంతమందికి అందాల్సిన పరిహారం అందలేదని 18ఏళ్లు నిండిన ప్రతీ యువతీయువకులకు పరిహారం అందించేలా చూడాలని కోరారు. అలాగే ముంపుకు గురవుతున్న కొన్ని గ్రామాలను 41.15 కాంటూరులో చేర్చాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో మండల ప్రధాన కార్యదర్శి కే.వీ.రామారావు, భాగ్యలక్ష్మి, మురళీ మోహన్ ఉన్నారు.

చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలి

టి.నరసాపురం, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : చోరీల పట్ల షాపు యజమానులు అప్రమత్తంగా ఉండాలని ఎస్.ఐ. ఎం.జయబాబు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో వర్తక సంఘాలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులంతా సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేముల సత్యనారాయణ, జూలూరి గోపి, ముత్తంశెట్టి శ్రీనివాస్, జె.మణికంఠ, సుబ్బరాజు, పరిమి కల్యాణ్, చేబోలు తాతారావు, శ్రీను పాల్గొన్నారు.

అవినీతిపై చర్యలు తీసుకోండి

కుక్కునూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పని చేస్తున్న సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వై.నాగేంద్రరావు ఆరోపించారు. మంగళవారం కుక్కునూరులో గిరిజన భూముల్లో గిరిజనేతరులు ఇష్టారాజ్యంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారని ఆరోపించారు. నర్సరీ యజమానుల నుంచి విద్యుత్ అధికారి లంచాలు తీసుకుంటూ అక్రమంగా విద్యుత్ సౌకర్యం కల్పించారని తెలిపారు. నూతనంగా విద్యుత్ కనెక్షన్ కావాలంటే డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కుక్కునూరు సబ్ స్టేషన్‌లో ఆపరేటర్ అసభ్యకరంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు.



● లింగపాలెం : పదేళ్లుగా గ్రామ పంచాయతీలలో కంప్యూటర్ ఆపరేటర్లుగా పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని గ్రామ పంచాయతీల కంప్యూటర్ ఆపరేటర్‌ల రాష్ట్ర యూనియన్ ప్రెసిడెంట్ కె.ఏడుకొండలు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు అమరావతిలో మంగళవారం వినతిపత్రం అందజేశారు.

అభయారణ్యంలో వన్యప్రాణుల వేట

ఇతర ప్రాంతాల నుంచి గొర్రె కాపరుల చొరబాటు

నిబంధనలకు విరుద్ధంగా బోట్లపై గోదావరిలో చేపల వేట



పోలవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పాపికొండల నేషనల్ పార్కు పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వన్యప్రాణులు, గోదావరిలో చేపట వేట యథేచ్ఛగా కొనసాగుతోంది. పేరంటాలపల్లి శివక్షేత్రం వరకూ గోదావరి నదికి ఇరువైపులా పాపికొండల నేషనల్ పార్కు విస్తరించి ఉంది. ఈ రిజర్వు ఫారెస్టు ప్రాంతంలో పదేళ్ల క్రితం వరకూ నదీ పరివాహక ప్రాంతాలకు ఇరువైపులా గిరిజన గ్రామాలు ఉండేవి. ప్రాజెక్టు నిర్మాణంలో పునరావాసాలకు తరలించడంతో ఆయా ప్రాంతాల్లో వన్య ప్రాణుల సంచారం, సంతతి పెరుగుతూ వస్తున్నది. అడవి పందులు, కొండగొర్రెలు, గొర్రెగేదెలు, నెమళ్లు, జింకలు, ఎలుగుబంట్లు, కుందేళ్లు, నక్కలు, వివిధ జాతుల పాములు, నక్కలు, నదిలో మొసళ్లు సంచరిస్తూ తమ సంతతిని వృద్ధి చేసుకుంటున్నాయి. గతేడాది నుంచి తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల నుంచి గొర్రెల కాపరులు, ధవళేశ్వరం, కొవ్వూరు ప్రాంతాల నుంచి మత్స్యకారులు పోలవరం ప్రాజెక్టు ఎగువ భాగానికి నేషనల్ పార్కులోపలికి చొరబడి వన్యప్రాణులను, గోదావరిలో చేపలను వేటాడి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ములు చేసుకుంటున్నారు. గొర్రెల కాపరులు నాటు తుపాకులు, వన్యప్రాణులను పట్టుకునే ఉచ్చులతో అడవి పందులను, కొండ గొర్రెలను, నెమళ్లను, అడవి కోళ్లను ఇతర వన్య ప్రాణులను వేటాడి మాంసాన్ని మైదాన ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. దళారీల ద్వారా ఇతర ప్రాంతాలకు ఎగుమతులు సైతం చేస్తున్నారు. ఆయా ప్రాంతాలలో విధులు నిర్వహించాల్సిన బీటు ఆఫీసర్లు, సిబ్బంది పోలవరం అటవీశాఖ కార్యాలయాలకు ఇళ్లకు పరిమితమై ఉండడం, విధులు నిర్వహించాల్సిన ప్రాంతాలకు తరచూ వెళ్లకపోవడం వల్ల అడవిలో వేటలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఇక గోదావరి నదిలో ప్రాజెక్టు ఎగువన నిషేధిత దెయ్యం వల (అప్పుడే పుట్టిన చిన్నచేప పిల్లలను సైతం పట్టే ఐలా వల)తో వేటాడి ఆ ప్రాంతంలోనే ఎండబెట్టి అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా గొందూరు గండిపోశమ్మ ఆలయ సమీపంలోకి అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. నిత్యం గోదావరిలో చిన్న పెద్ద చేపలతో సహా సుమారు ఐదు నుంచి పది టన్నుల చేపలను పట్టి రవాణా చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మత్స్య సంపద పూర్తిగా నశిస్తుందని పరిసర ప్రాంతాల మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టుకి కుడి ఎడమ చెక్‌పోస్టులు, మండలంలో పాపికొండల నేషనల్ పార్కులోకి వెళ్లే పలుమార్గాల అటవీశాఖ చెక్‌పోస్టుల సిబ్బంది విధుల అలసత్వం, చేతివాటం పాపికొండల నేషనల్ పార్కులోకి చొరబాటుకి కారణాలని స్థానికులు చెబుతున్నారు.

బాలికపై అత్యాచారం కేసులో ఇద్దరి అరెస్టు



కేసు వివరాలు చెబుతున్న సీఐ కృష్ణ

కైకలూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కైకలూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని బాత్రూంలో ఈ నెల 7న ఉదయం ఓ పసికందు మృత దేహం లభ్యమైన సంఘటనకు సంబంధించిన కేసు దర్యాప్తులో మైనర్ బాలికపై అత్యాచార సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈ అత్యాచార సంఘటనపై నమోదైన కేసులో ఇద్దరు యువకులను ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ మంగళవారం అరెస్టు చేశారు. సీఐ కృష్ణ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మండలానికి చెందిన ఒక బాలిక పసికందుకు జన్మనిచ్చినట్లు కేసు దర్యాప్తులో గుర్తించామని, బాలికను విచారించగా రాచపట్నం గ్రామానికి చెందిన కోనాల గణేష్ (32), ఏలూరు జిల్లా పెదవేగి మండలం కొప్పాక గ్రామానికి చెందిన ప్రత్తిపాటి వినీత్ (25) అత్యాచారం చేశారని తెలిపిందని సీఐ చెప్పారు. దర్యాప్తు అనంతరం వారిని అరెస్టుచేసి కైకలూరు కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు తెలిపారు. పట్టణ ఎస్సై శ్రీను, వెంకట్ కుమార్ పాల్గొన్నారు.

యువకుల గొడవలో ఒకరికి గాయాలు

ముదినేపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తి శరీరపు రంగు విషయమై ఎద్దేవా చేయడమే కాక అతనితో గొడవపడి తీవ్ర గాయాలకు గురి చేసిన సంఘటన ముదినేపల్లి మండలం శింగ రాయపాలెంలో జరిగింది. గ్రామానికి చెందిన కోగంటి దుర్గారావు అనే వ్యక్తి కోతమిషన్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పని ముగించుకుని సోమవారం సాయంత్రం ఇంటికి వెళ్తున్న సమయంలో దగ్గరలో క్రికెట్ ఆడుతున్న అదే గ్రామానికి చెందిన దారపు వంశీ, అతని సోదరుడు సంతోషం నల్లోడు అంటూ ఎద్దేవా చేశారు. దీంతో దుర్గారావు కోప్పడడంతో అతడిపై వంశీ, సంతోష్ దాడి చేసి తీవ్ర గాయాలకు గురి చేశారు. కుటుంబ సభ్యులు అతడిని గుడివాడ ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వీరభద్రరావు తెలిపారు.

నేడు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు



ముదినేపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు బుధవారం నిర్వహించనున్నారు. ప్రతీ నెలా 15న జరగాల్సిన క్లస్టర్ సమావేశాలను ఈనెల 12నే నిర్వహించాలని పాఠశాలల విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు తరగతులను నిర్వహించి, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేయాలని, అనంతరం 1 గంటకు క్లస్టర్ మీటింగ్‌కు ఉపాధ్యాయులు హాజరు కావాలన్నారు. ఉదయం 12 గంటల వరకు పాఠశాలలను నిర్వహించే విషయాన్ని విద్యార్థులకు, పేరెంట్స్‌కు తెలియజేయాలని సూచించారు. వివిధ పరీక్షల డ్యూటీల్లో ఉన్న ఉపాధ్యాయులు డ్యూటీ ముగిశాక స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రతీ ఉపాధ్యాయుడు తాము బోధించే తరగతులకు సంబంధించిన గత కాంప్లెక్స్ సమావేశాల అనంతరం జరిగిన పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కుల వివరాలు, హాజరు వివరాలు తీసుకురావాలని కమిషనర్ తన ఆదేశాల్లో పేర్కొన్నారు.


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎంవీఐ జగదీశ్

వాహనదారులు నిబంధనలు పాటించాలి

ఎంవీఐ జగదీశ్

మండవల్లి మార్చి 11(ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలకు అడ్డుకట్ట వేస్తామని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్ తెలిపారు. మండవల్లి మండలంలో మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహనదారులు నిబంధనలు పాటించకపోవడంతో పెద్దఎత్తున ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనాలు తనిఖీలతో పాటు డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్లు ధరించాలని, డ్రైవర్ల వేగ నియంత్రణ ఎంతో అవసరమని వివరించారు.



భారీ వాహన రాకపోకల నియంత్రణ

మండవల్లి మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండవల్లి గ్రామంలోని కైకలూరు సందులో భారీ వాహనాలకు ప్రవేశం లేదని సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్‌బాబు తెలిపారు. కైకలూరు సందులో రోడ్డులో భారీ వాహనాలు వెళ్లకుండా మంగళవారం రోడ్డుకు ఇరువైపులా ఐరన్ గడ్డర్లు ఏర్పాటు చేయించారు. కార్యదర్శి గిరిజ కుమారి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పదిలో మెరుగైన ఉత్తీర్ణత సాధించాలి


ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు

కలిదిండి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో శ్రీనివాసరావు అన్నారు. గుర్వాయిపాలెం జడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పది ప్రత్యేక తరగతులను మంగళవారం ఆయన పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారు ఉత్తీర్ణులయ్యే విధంగా ప్రత్యేక బోధన చేయాలన్నారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు.

విద్యార్థులకు ప్యాడ్లు అందజేత

ముదినేపల్లి: మండలంలోని పెద గొన్నూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విశ్వనాద్రిపాలెం కోటి శ్రీవల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కోటి రామచంద్రరావు మంగళవారం పరీక్ష ప్యాడ్లు అందజేశారు. చైర్మన్ కోటి గణేశ్వరమ్మ, హెచ్‌ఎం పాల్గొన్నారు.

● కైకలూరు: ఆటపాక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వశిష్ఠ మహిళా సంక్షేమ అభివృద్ధి సంస్థ ప్రతినిధులు మంగళవారం పరీక్షల ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. నడింపల్లి లక్ష్మీసత్యనారాయణ, దేవి విద్యార్థులకు పరికరాలను అందజేశారు. హెచ్‌ఎం సుభాషిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి


మాట్లాడుతున్న మత్స్యశాఖాభివృద్ధి అధికారి రవికుమార్

కలిదిండి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవి దృష్ట్యా ఆక్వా సాగులో నీటి యాజమాన్య పద్ధతులను అవలంబించాలని మండల మత్స్యశాఖాభివృద్ధి అధికారి రవికుమార్ అన్నారు. మంగళవారం తాడినాడలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెరువుల్లో నీటిని ఆక్వా ల్యాబ్ పరీక్షలు చేయించుకుని నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. చేపలు, రొయ్యలు వైరస్ బారిన పడితే వెంటనే పరీక్షలు చేయించి మందులు వాడాలన్నారు. వేసవిలో చెరువుల్లో ఆక్సిజన్ లోపించే ప్రమాదం పొంచి ఉంటుందని నిరంతరాయంగా ఏరియేటర్లు తిరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్, విలేజ్ ఫిషరీష్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ముసునూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ముసునూరు గురుకుల బాలికల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఐదవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. పాఠశాలలో 80 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో నాలుగో తరగతి పూర్తి చేసిన ఆసక్తి కలిగిన బాలికలు ఈ నెల 31వతేదీలోగా ఏపీఆర్ఎస్, ఏపీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వచ్చే నెల 25న రాత పరీక్ష నిర్వహించనున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకం

ముదినేపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పెద్ద సంఖ్యలో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. నాగ ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ఏసీ ఆర్.గంగా శ్రీదేవి ఆధ్వర్యంలో అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ అభిషేకాలు నిర్వహించారు.



పిఠాపురం వెళుతూ ముదినేపల్లికి చేరిన జనసేన అభిమాని వినయ్‌కుమార్

జనసేన అభిమాని కాలి నడకన పిఠాపురం

ముదినేపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 14న జరగనున్న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభకు కృష్ణా జిల్లా ఉయ్యూరు నుంచి కాలినడకన బయలుదేరిన ఆ పార్టీ అభిమాని మంగళవారం రాత్రి ముదినేపల్లికి చేరారు. ఉయ్యూరు పట్టణ జనసేన పార్టీ నాయకుడు గోపరాజు వినయ్‌కుమార్ పిఠాపురంలో జరగనున్న జనసేన ఆవిర్భావ సభ విజయవంతం కావాలని కోరుతూ కాలినడకన మంగళవారం సాయంత్రం బయలుదేరారు. ఆయనతో పాటు మరో ఇరువురు జనసేన నాయకులు కూడా ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. ముదినేపల్లికి చేరిన వినయ్‌కుమార్‌కు స్థానిక జనసేన నాయకులు స్వాగతం పలికారు. ఉయ్యూరు పట్టణంలోని పలు సమస్యలను పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లాలన్న లక్ష్యంతో తాను పిఠాపురం వరకూ కాలినడకన వెళ్తున్నట్లు వినయ్‌కుమార్ తెలిపారు.



సింహవాహనంపై వేణుగోపాలుడి గ్రామోత్సవం

ముదినేపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గురజ గ్రామంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా మంగళవారం సింహవాహనంపై స్వామివార్ల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఉదయం హోమం, శ్రీ చక్రతాళ్వార్ ఊరేగింపు అనంతరం వైఖానస సంప్రదాయం ప్రకారం సింహవాహనంపై రుక్మిణీ, సత్యభామ సమేత వేణు గోపాలస్వామిని గ్రామంలో ఊరేగించారు. ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకుడు తేజో రామ్, ఆగమ శాస్త్ర పండితుడు విజయవాడకు చెందిన పరాశరం శ్రీరంగనాథాచార్యులు హోమాలు, అభిషేకాలు నిర్వహించారు.

పేదవాడి ఆరోగ్య బాధ్యత ప్రభుత్వానిదే

ముసునూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పేదవాడి పూర్తి ఆరోగ్య భద్రత కూటమి ప్రభుత్వానిదని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గుళ్ళపూడి గ్రామానికి చెందిన నూర్‌బాషా ఆయిసా రజియిల్లా (15) అనే బాలిక విజయవాడ ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉండి చికిత్స పొందుతున్నది. ఈ నేపథ్యంలో మెరుగైన వైద్యం కోసం ఆర్థికసాయం నిమిత్తం బాలికల తల్లిదండ్రులు మంత్రిని అభ్యర్థించారు. మంగళవారం సీఎం సహాయనిధి నుంచి నాలుగు గంటల్లో రూ2.50లక్షలను మంత్రి మంజూరు చేయించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను మంత్రి పరామర్శించి చెక్కును తల్లిదండ్రులకు అందజేశారు.


బాలిక తల్లిదండ్రులకు చెక్కును అందిస్తున్న మంత్రి పార్థసారథి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పట్టు సాధించాలి

నూజివీడు టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై విద్యార్థులు పట్టు సాధించాలని గ్లోబల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి. మురళీనాయుడు అన్నారు. సోమవారం రాత్రి టెక్‌జెట్ ముగింపు కార్యక్రమాన్ని నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించి అనువర్తనాలు, ఎక్స్‌పోల ప్రాముఖ్యతను విద్యార్థులు అర్థం చేసుకోవాలన్నారు. ఏపీ ఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ మధుమూర్తి మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా ఆర్జీయూకేటీ ఇంజినీరింగ్ ఇంటిగ్రేటెడ్ కోర్సులను అమలు పరుస్తున్న విధానం, అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన టెక్‌జెట్‌లో దాదాపు 1500 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకుని హ్యాక్‌.దాన్, మెగా ఎక్స్‌పో విభాగాల్లో పాల్గొన్నారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్, నూజి వీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్ ఏవో లక్ష్మణరావు, డీన్‌ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ చిరంజీవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మురళీనాయుడు

వేల్పుచర్ల స్కూలుకే సుశీల పోస్టింగ్

ముసునూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పుచర్ల జడ్పీపాఠశాలకే ఉపాధ్యాయురాలు పి.సుశీలకు జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు మంగళవారం పోస్టింగ్ ఇచ్చారు. అయితే ఈ పాఠశాలలో లెక్కలు ఉపాధ్యాయినీగా పనిచేస్తున్న సుశీల పనితీరుపై విద్యార్థులు, తల్లిదండ్రులు, సహచర ఉపాధ్యా యులు సైతం ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, దీనిపై నూజివీడు డీవైఈవో సేవ్యా విచారణ చేసి, నివేదిక పంపారు. ఈ నివేదిక ఆధారంగా సుశీలను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు. ఈ ఫిర్యాదుపై ఉన్నతాధికారులు మరలా సమగ్ర విచారణ చేశారు. నివేదిక అధికారంగా ఉపాధ్యాయురాలు సుశీలకు వేల్పుచర్ల పాఠశాలలో పోస్టింగ్ ఇస్తూ జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకట లక్ష్మమ్మ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై గ్రామ సర్పంచ్ పి.మోహన్‌రావు హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

నూజివీడు టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పోతురెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం పోతురెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన భోజనశాలను ఆయన పరిశీలించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. సీపీఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు అక్కినేని చందు పాల్గొన్నారు.

బ్రాందీషాపు వద్దు

చాట్రాయి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): చాట్రాయిలో పాత ఎంపీడీవో ఆఫీస్ సమీపంలో బ్రాందీషాపు ఏర్పాటు చేయవద్దని కోరుతూ 119 సంతకాలతో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లో గ్రామస్తులు వినతిపత్రాలు అందజేశారు. గ్రామస్తులు జి.చెన్నకేశవరెడ్డి, తుమ్మూరు సత్యనారాయణరెడ్డి తదితరులు మాట్లాడుతూ ఇదే ఏరియాలో విద్యార్థుల ట్యూషన్ సెంటర్లు ఉన్నాయని, ప్రయాణికులు విశాఖ, హైదరాబాద్ బస్సులు ఎక్కుతుంటారన్నారు. ఈ మేరకు వినతి పత్రాలు కలెక్టర్, నూజివీడు సబ్‌కలెక్టర్, సీఐకి పంపించామన్నారు.


మాట్లాడుతున్న కొమ్మన విజయ

చంద్రబాబు పాలనలోనే అంగన్‌వాడీలకు భరోసా

నూజివీడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో అంగన్‌వాడీలను రోడ్డున పడేసిన ఘనత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ఏలూరు పార్లమెంట్ అంగన్‌వాడీ, డ్వాక్రామహిళా అధ్యక్షురాలు కొమ్మని విజయ విమర్శించారు. నూజివీడు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు అత్యధికంగా వేధింపులకు గురైన ఘటనలు గత వైసీపీ పాలనలోనే జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంగన్‌వాడీలకు ఉద్యోగ భరోసా కల్పించడంతో పాటు జీతాలు పెంచారన్నారు. తెలుగునాడు అంగన్‌వాడీ రాష్ట్రకార్యవర్గ అధ్యక్షురాలు కొడాలి హేమలత, సయ్యద్ నజీమున్నీసా, 19వ వార్డు అధ్యక్షురాలు జాలాది సుధారాణి, రుద్రపాటి లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

ఇంటర్ ఫిజిక్స్ పరీక్ష ప్రశాంతం

చాట్రాయి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): చాట్రాయి జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో మంగళవారం ఇంటర్ ఫస్ట్‌ియర్ ఫిజిక్స్, ఎకనామిక్ పరీక్షలు జరిగాయి. మొత్తం 150 మంది పరీక్ష రాయవల్సి ఉండగా 138 మంది హాజరయ్యారని ఎంఈవో వీఎస్‌వీ బ్రహ్మచారి తెలిపారు.

12 మంది గైర్హాజరు

ముదినేపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలకు మంగళవారం 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 113 మంది హాజర య్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఓరుగంటి సత్యనారాయణమూర్తి తెలిపారు. డిపార్ట్‌మెంటల్ అధికారి సుధాకర్ పరీక్షలను పర్యవేక్షిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475


మర్లపాలెం రామాలయం నుంచి భద్రాచలం కాలినడకన బయలు దేరుతున్న భక్తులు

కాలినడకన భద్రాచలానికి భక్తులు

చాట్రాయి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మర్లపాలెం రామాలయంలో మంగళవారం తెల్లవారుజామున 70 మంది భక్తులు స్వామివారికి పూజలు చేసి భద్రాచలం రాములోరి దర్శనానికి కాలినడకన బయలుదేరి వెళ్లారు. గ్రామస్తులు భద్రాచలం వెళుతున్న భక్తులను ఊరు పొలిమేర వరకు సాగనంపి వీడ్కోలు పలికారు. జైశ్రీరామ్ నామాన్ని జపిస్తూ భక్తులు నడక సాగించారు. ఐదేళ్ల నుంచి ప్రతి ఏడాది భక్తులందరం కలిసి కాలినడకన భద్రాచలం వెళ్ళి రాములవారిని దర్శించుకుంటున్నామని గ్రామ ఉపసర్పంచ్ వెల్ది రాజారావు చెప్పారు.

చెత్త రహిత గ్రామాలుగా తీర్చి దిద్దుదాం

చాట్రాయి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి చెత్త రహిత ఆరోగ్య గ్రామాలను తయారు చేద్దామని ఎంపీడీవో విజయలక్ష్మి కోరారు. చాట్రాయిలో మంగళవారం ఎంపీడీవో ఆధ్వర్యంలో అధికారులు ఇంటింటికి వెళ్ళి తడి పొడిచెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో, అధికారులు

ఉలిక్కి పడిన చిత్తపూరు గ్రామస్థులు

» కానిస్టేబుల్‌ను కత్తితో పొడిచిన అంతర్ రాష్ట్ర దొంగ

చాట్రాయి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పరిధిలోని సత్తుపల్లి పట్టణంలో మంగళవారం ఐడీ పార్టీ కానిస్టేబుల్ నరేశ్‌ని కత్తితోపొడిచి పరారైన అంతర్ రాష్ట్ర దొంగ తిరువీది సురేందర్(30) తమ గ్రామానికి చెందిన వాడని తెలిసి చాట్రాయి మండలం చిత్తపూరు గ్రామస్తులు ఉలిక్కి పడ్డారు. సత్తుపల్లి బస్టాండ్‌లో సురేందర్ అనుమానాస్పదంగా కన్పించటంతో గుర్తించిన ఐడీ పార్టీ కానిస్టేబుల్ నరేశ్ పట్టుకునే ప్రయత్నం చేయగా, సురేందర్ బైక్‌పై పరార్ అయ్యాడు. కానిస్టేబుల్ నరేశ్ వెంటాడి అడ్డగించటంతో అతన్ని కత్తితో పొడిచి సురేందర్ పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ నరేశ్‌ని ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి అనాధగా మారిన సురేందర్ ఏ కొండూరు మండలం మాధవరంలో అమ్మమ్మ ఇంటి వద్ద పెరిగాడని, చిన్న వయస్సు నుంచే దొంగతనాలు చేస్తూ అనేక సార్లు పట్టుబడి జైలు శిక్ష అనుభవించాడని గ్రామస్తులు చెబుతున్నారు. జైలు నుంచి కొంత కాలం క్రితం బయటకు వచ్చిన సురేందర్ దొరక్కుండా సత్తుపల్లి, ఖమ్మం ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

నాగేశ్వరరావు కుటుంబానికి పరామర్శ

ఆగిరిపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అన్నే నాగేశ్వరరావు అనారోగ్యంతో ఇటీవల మరణించారు. మంగళవారం ఆగిరిపల్లిలోని ఆయన నివాసంలో కుటుంబ సభ్యులను మాజీ కేంద్ర మంత్రి కావూరి సాంబశివరావు పరామర్శించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాతూరి రవి తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభ పోస్టర్ విడుదల

చాట్రాయి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో 14వ తేదీన జరగనున్న జనసేన 12వ ఆవిర్భావ సభకు తరలిరావాలని ప్రచురించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం చాట్రాయిలో నూజివీడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణిబాబు ఆవిష్కరించారు. అనంతరం ఫణిబాబు చనుబండ, బూరుగుగూడెం, పోలవరం తదితర గ్రామాల్లో పర్యటించి ప్రజలను కలుసుకొని సభకు భారీ సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తుమ్మల జగన్, రాంబాబు, హరీష్, రాజా, శ్రీమన్నారాయణ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.